www.visalaandhra.com

శనివారం
11-03-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 258
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

18న బంగ్లాదేశ్, భారత్ తొలి ఆయిల్ పైప్‌లైన్

ప్రారంభించనున్న హసీనా, మోదీ

బంగ్లాదేశ్, భారత్ సరిహద్దు ఆవలి తొలి ఆయిల్ పైప్‌లైన్ ప్రారంభానికి రంగం సిద్ధమైంది. ఈనెల 18న పైప్‌లైన్‌ను రెండు దేశాల ప్రధానమంత్రులు షేక్ హసీనా, నరేంద్ర మోదీ సంయుక్తంగా ప్రారంభిస్తారు. 2లో

ప్రాణాంతకంగా ఫ్లూ

- హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లుయెంజాతో దేశంలో ఇద్దరి మృతి
- కర్ణాటక, హరియాణాలో ఒక్కో మరణం నమోదు
- నెలాఖరుకు ఇన్ఫెక్షన్ కేసులు తగ్గే అంచనా

న్యూఢిల్లీ: ఇప్పుడిప్పుడే కోవిడ్ మహమ్మారికి ముందున్న పరిస్థితులు నెలకొంటున్న సమయంలో హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లుయెంజా పంజా విరుసుతోంది. దీంతో దేశంలో ఇన్ఫెక్షన్ కేసులు నానాటికీ పెరుగుతున్నాయి. తాజా ఇద్దరు ఈ వైరస్ బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. హెచ్3ఎన్2 వల్ల కర్ణాటక, హరియాణా రాష్ట్రాల్లో ఒక్కో మరణం నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ శుక్రవారం వెల్లడించింది. పరిస్థితిని నిశితంగా సమీక్షిస్తున్నట్లు తెలిపింది. నెలాఖరుకు ఇన్ఫెక్షన్ కేసులు తగ్గుతాయని అంచనా వేసింది. 'హెచ్3ఎన్2 సీజనల్ ఇన్‌ఫ్లుయెంజా. చిన్న పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులైన వృద్ధులకు ఇది త్వరగా సోకుతుంది. ఇప్పటివరకు కర్ణాటకలో, హరియాణాలో ఒక్కొక్కరు ఈ ఇన్‌ఫ్లుయెంజా బారినపడి చనిపోయారు. దీంతో దేశంలో తొలి రెండు మరణాలు నమోదయ్యాయి. అయితే ప్రతిఏటా సీజనల్

- మిగతా 2 లో

ఉద్యోగుల నిరసన గళం

- నల్ల బ్యాడ్జీలతో ఆందోళనలు
- 26 జిల్లాల్లో ప్రదర్శనలు
- సీఎస్‌కు ఏపీ జేఏసీ అమరావతి సవరించిన నోటీసు
- అవసరమైతే ఉద్యమం తీవ్రతరం : బొప్పరాజు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : ఉద్యోగుల నిరసనలు వెల్లువెత్తాయి. నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఏపీ జేఏసీ అమరావతి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం ఆందోళనలు కొనసాగాయి. ఉద్యోగుల డిమాండ్ల సాధనపై ప్రభుత్వం దిగిరానందున, మొక్కుబడిగా చర్యలు చేపట్టడాన్ని నిరసిస్తూ ఈనెల 9 నుంచి సవరించిన ఉద్యమ కార్యాచరణ షెడ్యూలును ఏపీ జేఏసీ అమరావతి ప్రకటించింది. దశల వారీగా ఆందోళనలు చేపడుతూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచనుంది. రాష్ట్రంలోని 26 జిల్లాల వారీగా ఉద్యోగులంతా ఉద్యమంలో నిమగ్నమయ్యారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు, ప్రదర్శనలు నిర్వహించారు. ఏపీ పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీరింగ్ కార్యాలయాల వద్ద ఏపీ జేఏసీ అమరావతి అధ్వర్యంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసనకు దిగారు. జేఏసీ చైర్మన్ బొప్పరాజు మాట్లాడుతూ ప్రభుత్వ మాటలను ఉద్యోగులు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఉద్యమ కార్యాచరణ ప్రకారమే ముందుకు వెళతామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 20 వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలు కొనసాగుతాయని పునరుద్ఘాటించారు. అవసరమైతే కార్యాచరణను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) కార్యాలయ వద్ద ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబ్రోలు కృష్ణమూర్తి అధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు నిరసన చేపట్టగా, వారికి ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, నేతలు పీవీ మురళీకృష్ణ, గిరికుమార్, ఎన్.శ్రీనివాస్ తదితరులు అక్కడికి వచ్చి సంఘీభావం తెలిపారు. ఉద్యోగులు ఒక్కసారిగా ఉద్యమబాట పట్టడంతో ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరైంది. మొదటి నుంచి జగన్ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల వివక్ష చూపుతోంది. వారు పని చేసిన కాలానికి ప్రతి నెలా ఒకటో

- మిగతా 2 లో

మహిళా రిజర్వేషన్ సాధించే వరకు

విశ్రమించం

బీఆర్ఎస్ నేత కవిత స్పష్టీకరణ - ఢిల్లీలో నిరాహార దీక్ష

- వామపక్షాలతో సహా 18 పార్టీల మద్దతు
- చివర్లో నిమ్మరసం ఇచ్చిన సీపీఐ కార్యదర్శి నారాయణ

కవితతో దీక్ష విరమింపచేసి ప్రసంగిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించేంత వరకు విశ్రమించేది లేదని బీఆర్ఎస్ నేత కె.కవిత తేల్చిచెప్పారు. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కల్పన డిమాండ్‌తో ఆమె దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద శుక్రవారం ఆరు గంటల నిరాహార దీక్ష చేశారు. ఈనెల 13 నుంచి పార్లమెంటులో బడ్జెట్ సమావేశాలు జరగనున్న క్రమంలో సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని కేంద్రప్రభుత్వానికి ఆమె సూచించారు. దీక్షను సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రారంభించారు. ఈసారి పార్లమెంటు సమావేశాల్లో మహిళా బిల్లును ప్రవేశపెట్టాల్సిందేనన్నారు. తొమ్మిదేళ్లుగా ఇది పెండింగ్‌లో ఉందని, ఎంతో కష్టపడితే పంచాయతీల్లో మహిళలకు రిజర్వేషన్‌ను ప్రభుత్వం కల్పించిందని, ఇప్పుడు చట్టసభల్లోనూ కల్పించాలని అన్నారు. మహిళలకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా సమానత్వం లేకపోతే దేశం పురోగతి సాధించలేదని ఏచూరి అన్నారు. సాయంత్రం 4 గంటల వరకు కవిత తన దీక్షను కొనసాగించారు. ఆమెకు సీపీఐ కార్యదర్శి నారాయణ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. అనంతరం కవిత మాట్లాడుతూ ప్రపంచం అభివృద్ధి చెందుతున్న గతిలో భారత్ కూడా అభివృద్ధి సాధించాలంటే రాజకీయాల్లో మహిళలు కీలక పాత్ర పోషించాలని అన్నారు. అందుకోసం 27ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు కీలకమన్నారు. పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ సాధించే వరకు విశ్రమించేది లేదన్నారు. అవసరమైతే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. మహిళా బిల్లు ఓ చారిత్రక అవసరం, దానిని సాధించి తీరాల్సిందేనని కవిత అన్నారు. దీక్షకు మద్దతు ఇచ్చిన పార్టీల నేతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శ్యామ్ రజక్ (ఆర్జేడీ) మాట్లాడుతూ మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం సముచితంగా లేనంత వరకు భారత ప్రజాస్వామ్యం బలోపేతం కాలేదన్నారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళా రిజర్వేషన్ 33శాతం

- మిగతా 2 లో

తక్షణమే మహిళలకు 33 శాతం కోటా
సీపీఐ కార్యదర్శి నారాయణ డిమాండ్ 2లో

చరిత్రకెక్కిన జిన్‌పింగ్

- చైనా అధ్యక్షుడిగా మూడోసారి పగ్గాలు
- రాజ్యాంగానికి కట్టుబడతా : నూతన అధ్యక్షుడి ప్రతిజ్ఞ
- ఉపాధ్యక్షుడిగా హాన్‌జెంగ్ ఎన్నిక

బీజింగ్: చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చరిత్రాత్మకంగా మూడవసారి అధ్యక్ష పగ్గాలు చేపట్టారు. చైనా కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుడు మావో జెడాంగ్ తర్వాత పదేళ్లకుపైగా అధికారంలో ఉండగలిగిన నాయకుడిగా నిలిచారు. ఆయన శుక్రవారం పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా (పీఆర్‌సీ) అధ్యక్షుడిగా, పీఆర్‌సీ సెంట్రల్ మిలటరీ కమిషన్ (సీఎంసీ) చైర్మన్‌గా జిన్‌పింగ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 14వ నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పీసీ) సమావేశాల్లో భాగంగా దేశ అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు కొందరు ఉన్నతాధికారుల ఎన్నిక జరిగింది. 2,950 మంది శాసనసభ్యులు ఏకగ్రీవంగా జిన్‌పింగ్‌ను ఎన్నుకున్నట్లు ఎన్‌పీసీ ప్రకటించింది. మూడవసారి అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్రకటించిన అనంతరం చైనా రాజ్యాంగానికి నిబద్ధుడినై

- మిగతా 2 లో

నీటి పారుదల ప్రాజెక్టులకు బడ్జెట్‌లో

15 శాతం నిధులు కేటాయించాలి

- పోలవరం బాధ్యత కేంద్రానిదే
- ఢిల్లీకి అఖిలపక్షాన్ని రాష్ట్రమే తీసుకువెళ్లాలి
- సజ్జలకు సీపీఐ నేతలు జల్లి విల్సన్, ఓబులేసు వినతి
- ప్రాజెక్టుల స్థితిగతులపై పార్టీ బృందం పర్యటన వివరాల వెల్లడి
- సీఎం, మంత్రుల దృష్టికి తీసుకువెళతానని 'సజ్జల' హామీ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం 2023–24 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్‌లో నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణాలకు 15 శాతం నిధులు కేటాయించి, పూర్తిగా ఖర్చు చేయాలని, పోలవరం జాతీయ ప్రాజెక్టు అయినందున నిర్మాణ బాధ్యత, నిర్వాసితుల పరిహారం చెల్లించే బాధ్యత కేంద్రమే వహించాలని, అందుకోసం ఢిల్లీకి అఖిలపక్ష బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల స్థితిగతులను తెలుసుకోవడానికి సీపీఐ రాష్ట్ర నాయకత్వ బృందం ఫిబ్రవరి 13 నుంచి 22 వరకు చేసిన పర్యటనలో దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కోరింది. శుక్రవారం ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి పార్టీ తరఫున మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, జి.ఓబులేసు ఆ మేరకు వివరాలను అందజేసి వాటిపై సమగ్రంగా చర్చించారు. సీపీఐ రాష్ట్ర నాయకత్వం 9 రోజుల పాటు ఈ మొత్తం ప్రాజెక్టులను పరిశీలించి వచ్చిన తర్వాత మార్చి 5న రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలతో విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిందని, అందులో ఏకగ్రీవంగా ఆమోదించిందని తీర్మానాలను సజ్జలకు జల్లి విల్సన్, ఓబులేసు వివరించారు. దీనిపై సజ్జల రామకృష్ణారెడ్డి సానుకూలంగా స్పందిస్తూ... రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, జల వనరుల శాఖ మంత్రి

- మిగతా 2 లో

అప్పులు ఆంధ్రులకు...

ఆస్తులు అదానీకా...?

బొగ్గు టెండరులో అదానీతో లాలూచీ ఏంటి?

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : జెన్కో విదేశీ బొగ్గు కొనుగోలు టెండరును అధిక ధరకు అదానీకి కట్టబెట్టడంలో వైసీపీ ప్రభుత్వానికి ఉన్న లాలూచీ ఏంటి? అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సూటిగా ప్రశ్నించారు. అప్పులు ఆంధ్రులకు, ఆస్తులు అదానీకి అప్పగిస్తారా? అని మండిపడ్డారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కృష్ణపట్నం థర్మల్ విద్యుత్ కేంద్రానికి అవసరమైన 7.5 లక్షల టన్నుల విదేశీ బొగ్గు కొనుగోలుకు గత జనవరిలో ఏపీపీడీసీఎల్ జారీ చేసిన టెండరు ప్రకటనతో వివిధ సంస్థలు బిడ్‌లు దాఖలు చేశాయని, ప్రైస్ బిడ్‌లో చెట్టినాడు సంస్థ ఎల్1గా నిలిచినప్పటికీ... తద్వారా రివర్స్ టెండరింగ్ వల్ల అదానీ సంస్థ ఈ బిడ్‌ను దక్కించుకుందన్నారు. 162 శాతం అధిక మొత్తం చెల్లించి అదానీ నుంచి బొగ్గు కొనాలని జగన్ ప్రభుత్వం నిర్ణయించిందని, దాని ఫలితంగా రూ.300 కోట్ల ప్రజాధనాన్ని అప్పనంగా అదానీకి ఇచ్చేందుకు సిద్ధమైందని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో వివిధ పోర్టులు, విద్యుత్ ప్రాజెక్టులు, సోలార్ పవర్ ఒప్పందాలు అదానీ కంపెనీలకు కట్టబెట్టిన జగన్ ప్రభుత్వం ఇప్పుడు బొగ్గు

- మిగతా 2 లో

ఇదీ లోకం!



కొనండి బాబూ, రాజధాని భూములు, అప్పుల్లో ఉన్నాం, కొని ఆదుకోండి!

ఈఎస్‌ఐసీ ప్రత్యేక సేవల పక్షోత్సవంతో

ఉపయోగమేది?

- మొక్కుబడి కార్యక్రమాలతోనే సరి
- మందుల్లేవ్... పరీక్షలు జరగవు
- నిధులిచ్చి చేతులు దులుపుకుంటున్న ఈఎస్ఐ కార్పొరేషన్

విశాలాంధ్ర–డిజిటల్: కార్మిక రాజ్య బీమా పథకం (ఈఎస్ఐ) క్రింద బీమా పొందిన కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు సూపర్‌స్పెషాలిటీ (షరతులకు లోబడి) సహా సహేతుకమైన వైద్య సంరక్షణ కల్పిస్తామన్న అధికారుల మాటలు ఆచరణలో అమలు జరగడంలేదు. ఐపీనే వీఐపీ' అనేది ఆకర్షణీయ నినాదంగా మిగిలిపోతున్నది తప్ప బీమాదారులకు ఇసుమంతైనా ఊరటకలగడంలేదు. ఈఎస్ఐ డిస్పెన్సరీలు, ఆసుపత్రులలో కనీస

- మిగతా 2 లో

సీఎన్‌జీ, పెట్రో ధరలపై ఆటో కార్మికుల ధర్నా

తగ్గించకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి హెచ్చరిక

విశాలాంధ్ర–విజయవాడ: పెంచిన సీఎన్‌జీ, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని ఏఐటీయూసీ ఆటోవర్కర్స్ యూనియన్ విజయవాడ గౌరవాధ్యక్షులు దోనేపూడి శంకర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పెంచిన సీఎన్‌జీ, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆటోవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యూనియన్ నగర కార్యదర్శి గూడెల జనార్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శంకర్ మాట్లాడుతూ పెంచిన సీఎన్‌జీ గ్యాస్ ధర మూలిగే నక్కమీద తాటికాయ పడ్డ చందగా ఉందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చే నాటికి కిలో రూ.60 ఉన్న సీఎన్‌జీ ప్రస్తుతం సెంచరికి చేరువుగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెస్ ఎత్తివేయకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కేంద్రం కార్పొరేట్ శక్తులకు పెద్దపీట వేస్తూ పేద ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్నారు. నిత్యావసరాల ధరలు నింగిని తాకటంతో సామాన్యులు బతకలేని పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేస్తున్న నవరత్నాలు ప్రజలకు పీడలాగా

- మిగతా 2 లో

18న బంగ్లాదేశ్, భారత్ తొలి ఆయిల్ పైప్‌లైన్

ప్రారంభించనున్న హసీనా, మోదీ

ఢాకా: బంగ్లాదేశ్, భారత్ సరిహద్దు ఆవలి తొలి ఆయిల్ పైప్‌లైన్ ప్రారంభానికి రంగం సిద్ధమైంది. ఈనెల 18న పైప్‌లైన్‌ను రెండు దేశాల ప్రధానమంత్రులు షేక్ హసీనా, నరేంద్ర మోదీ సంయుక్తంగా ప్రారంభిస్తారు. డీజిల్ సరఫరా కోసం ఈ పైప్‌లైన్ వినియోగమవుతుందని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇద్దరు ప్రధానులు పైప్‌లైన్‌ను ప్రారంభిస్తారని బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి డాక్టర్ ఏకే అబ్దుల్ మోమెన్ తెలిపారు. ఈ పైప్‌లైన్ నిర్మాణం పూర్తి అయిందని, భారత్ మనకు డీజిల్ పంపడం శుభ సమచారమని వెల్లడించారు. కాగా బాంగ్లాదేశ్ పెట్రోలియం కార్పొరేషన్, ధాకాకు డీజిల్ ఎగుమతి చేసేందుకు భారత్-బంగ్లాదేశ్ ఫ్రెండ్‌షిప్ పైప్‌లైన్ (ఐబీఎఫ్‌పీ)ను భారతీయ రుణరేఖ (లైన్ ఆఫ్ క్రెడిట్) నుంచి రూ.3.46 బిలియన్లతో ఏర్పాటు చేశారని అధికారిక నివేదిక వెల్లడించింది.

ఐఎస్ ఆత్మహుతి దాడిలో తాలిబన్ గవర్నర్ మృతి

కాబూల్: అఫ్గానిస్తాన్‌లోని బల్క్ ప్రావిన్స్‌లోని తాలిబన్ గవర్నర్ కార్యాలయం వద్ద పేలుడు (ఆత్మాహుతి దాడి) జరుగగా, గవర్నర్‌తో పాటు మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. 'గవర్నర్ కార్యాలయం భవనం రెండో అంతస్తులో గురువారం ఉదయం 9 గంటలకు పేలుడు సంభవించింది. గవర్నర్ మౌలావి మహమ్మద్ దావూద్ ముజమ్మిల్ మరణించారు' అని బాల్క్ పోలీసు అధికార ప్రతినిధి మహమ్మద్ ఆసిఫ్ వజీరి తెలిపారు. ఇది ఆత్మాహుతి దాడి అని, దీనికి ఐఎస్ గ్రూపు బాధ్యత వహించిందని పోలీసులు తెలిపారు. మహమ్మద్ దావూద్ ముజమ్మిల్ హత్యను ప్రాంతీయ రాజధాని అధికారి మజర్ ఏ షరీఫ్ ధ్రువీకరించారు.

2021లో తాలిబన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హత్యకు గురైన అత్యంత సీనియర్ ఈయనేనన్నారు. కాగా మహమ్మద్ దావూద్ ముజమ్మిల్ నాన్‌గర్హర్ తూర్పు ప్రావిన్స్‌కు గవర్నర్‌గా ఉన్నప్పుడు ఐఎస్ వ్యతిరేక పోరు సాగించారు. ఆయన గతేదాది అక్టోబరులో బల్క్ ప్రావిన్స్‌కు వచ్చారు. 'భారీ విస్ఫోటనం జరిగింది. నేను కింద పడి తీవ్రంగా గాయపడ్డాను. నా మిత్రుడు చేయి కోల్పోయారు' అని ప్రత్యక్ష సాక్షి ఖైరుద్దీన్ తెలిపారు.

నిజమైన యుద్ధానికి సిద్ధం కండి

ఉ.కొరియా సైనిక విన్యాసాల్లో కిమ్ ఆదేశాలు

సియోల్: సైన్యాన్ని నిజమైన యుద్ధం కోసం సిద్ధం చేయాలని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ ఆదేశించినట్లు ఆ దేశ అధికారిక మీడియా కేసీఎన్‌ఏ శుక్రవారం వెల్లడించింది. తన రెండో కుమార్తెతో కలిసి సైనిక విభాగం ఫైర్‌డ్రిల్‌ను పర్యవేక్షించినట్టు పేర్కొంది. అధికారిక మీడియా విడుదల చేసిన ఫోటోల్లో కిమ్, ఆయన కుమార్తె ఇద్దరూ అధికారులతో కలిసి ఫిరంగి దళం చేపట్టిన క్షిపణి ప్రయోగాన్ని వీక్షించారు. గురువారం బాలిస్టిక్ క్షిపణి ప్రయోగాన్ని గుర్తించామన్న దక్షిణ కొరియా సైన్యం.. అదే ప్రదేశం నుంచి అనేక ప్రయోగాల అవకాశాలను విశ్లేషిస్తున్నట్లు తెలిపింది. హస్వాంగ్ యూనిట్ ఒకేసారి ఆరు క్షిపణులను పరీక్షించిందని, దాడుల కోసం ఈ మిషన్ శిక్షణ తీసుకుందని కేసీఎన్‌ఏ అధికారులు ఫోటోలను విడుదలచేశారు. కొరియా పశ్చిమ సముద్ర లక్షిత జలాల్లోకి హస్వాంగ్ విభాగం శక్తివంతమైన క్షిపణులను పరీక్షించినట్టు తెలిపింది. ఈ డ్రిల్‌ను పరిశీలించిన కిమ్ రెండు వ్యూహాత్మక మిషన్లు అంటే యుద్ధాన్ని నిరోధించడం.. యుద్ధంలో చొరవ తీసుకోవడానికి సిద్ధంగా ఉండాలని సైనికులకు సూచించారు. ఇటువంటి యూనిట్లు నిజమైన యుద్ధం కోసం వివిధ పరిస్థితులలో విభిన్న రీతిలో వివిధ అనుకరణ విన్యాశాలను తీవ్రతరం చేయాలన్నారు. దక్షిణ కొరియా, అమెరికా ఐదేళ్లలోనే అతిపెద్ద సంయుక్త సైనిక విన్యాసాలను సోమవారం ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఉత్తర కొరియా విన్యాశాలు నిర్వహించింది. ఉభయ కొరియా దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఉత్తర కొరియా మరింత రెచ్చగొట్టేలా అణ్వాయుధ, క్షిపణి పరీక్షలను నిర్వహిస్తోంది. దీనికి ప్రతిస్పందనగా అమెరికాతో భద్రతా సహకారాన్ని దక్షిణ కొరియా తీసుకుంటోంది. అమెరికాకు కిమ్ సోదరి కిమ్ యో జోంగ్ ఈమధ్యనే హెచ్చరికలు చేయడం తెలిసిందే. అమెరికా, దక్షిణ కొరియా సంయుక్త సైనిక విన్యాసాలకు అభ్యంతరం తెలిపారు. తాము పరీక్షించే క్షిపణులను కూల్చివేస్తే, అది ఉత్తర కొరియాపై యుద్ధం ప్రకటించినట్లుగానే భావిస్తామని తేల్చిచెప్పారు. ఉత్తర కొరియా వ్యూహాత్మకంగా క్షిపణి పరీక్షలు చేపడుతోందని, అందుకు వ్యతిరేకంగా అమెరికా చేపట్టే ఎలాంటి సైనిక చర్య అయినా సరే యుద్ధ ప్రకటనే అవుతుందని కిమ్ యో జోంగ్ స్పష్టంచేశారు.

ప్రాణాంతకంగా ఫ్లూ

(మొదటిపేజీ తరువాయి)

ఇన్‌ఫ్లుయోంజా రెండు దశల్లో విజృంభిస్తుంటుంది. జనవరి నుంచి మార్చి వరకు ఆపై వర్షాకాలం తర్వాత కేసులు ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం ప్రజారోగ్య సవాళ్లను ఎదుర్కొనేందుకు రాష్ట్ర సర్వైలెన్స్ అధికారులు సర్వసన్నద్ధంగా ఉన్నారు. రియల్ టైమ్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ డీజీస్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ (ఐడీఎస్‌పీ) నెట్వర్క్‌తో రాష్ట్రాల్లో ఇన్‌ఫ్లుయోంజా కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం' అని ఆరోగ్యశాఖ ప్రకటన పేర్కొంది.

ఈనెల ఒకటో తేదీన కర్ణాటకలో 82 ఏళ్ల హైరె గౌడ హెచ్3ఎన్2 వైరస్ కారణంగా చనిపోయినట్లు ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ ధ్రువీకరించింది. హరియాణాలోని జింద్ జిల్లాకు చెందిన 56ఏళ్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ బాధితుడికి జనవరిలో హెచ్3ఎన్2 పాజిటివ్‌గా తేలగా ఆయన ఫిబ్రవరి 8న ఇంట్లో మృతి చెందారు. ఐడీఎస్‌పీ- ఐహెచ్ఐపీ (సమగ్ర ఆరోగ్య సమాచార వేదిక) తాజా డేటా ప్రకారం 3,038 ఇన్‌ఫ్లుయోంజా కేసులు దేశంలో ఉన్నాయి. ఇందులో 1,245 కేసులు జనవరిలో, 1,307 ఫిబ్రవరిలో, 486 కేసులు మార్చి 9వతేదీ నాటికి నమోదైనట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. జనవరిలో 3,97,814 కేసులు తీవ్ర శ్వాసకోస సమస్యలు లేక ఇన్‌ఫ్లుయోంజా (ఏఆర్ఐ/ఐఎల్ఐ) నమోదు కాగా ఫిబ్రవరిలో వీటి సంఖ్య 4,36,523కి పెరిగింది. మార్చిలో సంఖ్య 1,33,412కు చేరింది. తీవ్రమైన దీర్ఘకాల శ్వాససంబంధిత వ్యాధి (ఎస్ఏఆర్ఐ) కేసులు జనవరిలో 7,041గా ఉంటే ఫిబ్రవరిలో 6,919, మార్చి 9కి 1,866 కేసులు ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 28 వరకు 955 హెచ్1ఎన్1 కేసులు నమోదయ్యాయి. ఇందులో అధికంగా 545 కేసులు తమిళనాడులో నమోదు కాగా మహారాష్ట్రలో 170, గుజరాత్‌లో 74, కేరళలో 42, పంజాబ్‌లో 28 చొప్పున నమోదయ్యాయి. ఇదిలావుంటే, ఇతర ఇన్‌ఫ్లుయెంజాలతో పోల్చితే హెచ్3ఎన్2 వల్లే దేశంలో జర్వం కేసులు ఎక్కువైనట్లు కేంద్ర ఆరోగ్యశాఖ భావిస్తోంది. ఇన్‌ఫ్లుయెంజా ప్రాణాంతకం కాదని నిపుణులు చెబుతున్నారు. తగిన జాగ్రత్తలు పాటిస్తే ఇన్‌ఫ్లుయెంజా బారిన పడకుండా ఉండొచ్చని సూచించారు. ఇన్‌ఫ్లుయెంజా సోకిన వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వెలువడే తుంపరల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందుతుందని, తుంపరలున్న ప్రదేశాన్ని తాకి తమ ముక్కు, నోటిని చేతిలో ముట్టుకున్నా హెచ్3ఎన్2 సోకే ప్రమాదం ఉంటుందన్నారు. అందుకే ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇన్‌ఫ్లుయోంజా సోకితే 3-5 రోజుల వరకు జ్వరం, మూడు నుంచి ఐదు వారాల వరకు దగ్గు ఉంటుందని, గొంతు నొప్పి, ఒళ్లు నొప్పులు, వాంతులు, విరేచనాలతో పాటు కొందరికి శ్వాసక్రియలో ఇబ్బంది రావచ్చన్నారు. అన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఇన్‌ఫ్లుయోంజా బారిన పడకుండా ఉండవచ్చునని నిపుణులు సూచించారు.

ఆస్తులు అదానీకా...?

(మొదటిపేజీ తరువాయి)

టెండరునూ అధిక ధరకు అదానీ కంపెనీకి ఇచ్చేసిందన్నారు. కృష్ణపట్నం థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని కూడా అదానీకి అప్పగించే కుట్రకు వైసీపీ సర్కార్ తెరదీస్తోందని, విద్యుత్, ట్రూఅప్ చార్జీలంటూ రాష్ట్ర ప్రజలపై పదేపదే గుదిబండ మోపుతున్న జగన్ సర్కార్ అదానీ కంపెనీలకు మాత్రం దాసోహమంటోందని ధ్వజమెత్తారు. అందినకాడికి అప్పులు చేసి రాష్ట్ర ప్రజలపై పెను భారాలు మోపుతూ... ఆంధ్రుల ఆస్తులు మాత్రం అదానీకి ధారాదత్తం చేస్తోందన్నారు. దేశమంతా అదానీ అవినీతి, అక్రమాల గురించి చర్చిస్తుంటే... రాష్ట్రంలో జగన్ మంత్రివర్గ సమావేశం నిర్వహించి భూములను అదానీ కంపెనీలకు కట్టబెట్టారని దుయ్యబట్టారు. మోదీని, అదానీని ప్రసన్నం చేసుకునేందుకు జగన్ పదేపదే ఉవ్విళ్లూరుతున్నారని, తద్వారా లబ్ధిపొందేందుకు చూస్తున్నారని మండిపడ్డారు. బొగ్గు కొనుగోలులో అదానీకి అధిక మొత్తం ఎందుకు చెల్లిస్తున్నారో సీఎం ప్రజలకు సమాధానమివ్వాలని, అదానీకీ, వైసీపీ ప్రభుత్వానికి మధ్య ఉన్న లాలూచీ ఏమిటో బయటపెట్టాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

చరిత్రకెక్కిన జిన్‌పింగ్

(మొదటిపేజీ తరువాయి)

ఉంటానని, దానికి కట్టుబడి పరిపాలన అందిస్తానని జిన్‌పింగ్ ప్రతిజ్ఞ చేశారు. శిరస్సు వంచి సభకు నమస్కరించారు. ఈయన మరో ఐదేళ్లు పదవిలో కొనసాగుతారు. దీంతో ఆయన జీవితాంతం అధ్యక్ష పదవిలోనే ఉంటారన్న అంచనాలు పెరిగాయి. అయితే ఆయన గతేడాది అక్టోబరులో సీపీసీ అధినేతగా ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం విదితమే. జిన్‌పింగ్‌కు సన్నిహితుడైన హాన్‌జెంగ్‌ను కొత్త ఉపాధ్యక్షుడిగా ఎన్నకున్నట్లు ఎన్‌పీసీ ప్రకటించింది. మూడవ ప్లీనరీ సమావేశంలో ఉపాధ్యక్షుడి ఎన్నిక జరిగింది. చైనా తొలి ఉప ప్రధాని హాన్‌జెంగ్ నూతన ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనట్లు అధికారిక ప్రకటన పేర్కొంది. హాన్ చైనా ఉన్నతాధికారి. అంతర్జాతీయ సహకారం-ఇంధన సహకారంపై రష్యా-చైనా కమిషన్‌కు కో-చైర్‌గా; హాంగ్‌కాంగ్, మకావ్ వ్యవహారాల బాధ్యులుగా, వింటర్ ఒలింపిక్స్ స్టీరింగ్ గ్రూపు చైర్మన్‌గా వ్యవహరించారు. ఇదిలావుంటే నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా జావో లెజి, చైనా రాజకీయ సంప్రదింపుల సదస్సు చైర్మన్‌గా వాంగ్ హునింగ్ కూడా కొత్తగా ఎన్నికయ్యారు.

సీఎన్‌జీ, పెట్రో ధరలపై ఆటో కార్మికుల ధర్నా

(మొదటిపేజీ తరువాయి)

మారిందని ఎద్దేవా చేశారు. కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు సెస్‌లు తగ్గించారని తెలిపారు. ఆటోకార్మిక రంగాన్ని పరిశ్రమగా గుర్తించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఆర్.ఆంజనేయులు, మూలి సాంబశివరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై ఏదో రకంగా పన్ను భారాలు వేస్తూ ఆర్థికంగా కోలుకోలేని దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. పెంచిన సీఎన్‌జీ, పెట్రోల్, డీజీల్ ధరలు తగ్గించకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటోవర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు ఎర్ర రాములు, సంయుక్త కార్యదర్శులు పెంద్ర సుబ్రహ్మణ్యం, కె.శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శి కె.వెంకచ్చి, ఆటో వర్కర్స్ యూనియన్ నగర నాయకులు తరుణ్ శ్రీను, పసుపులేటి అంజి, మూర్తి, జోసెఫ్, అహ్మద్, ఏఐటీయూసీ నగర నాయకులు కేవీ భాస్కరరావు, కొట్టు రమణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల నిరసన గళం

(మొదటిపేజీ తరువాయి)

తేదీన వేతనాలు రావడం గగనంగా మారింది. దాచుకున్న డబ్బులు ఇవ్వకుండా ఈ ప్రభుత్వం దాట వేస్తోంది. పీఎఫ్ రుణాలు, పీఆర్సీ తదితర ఆర్థికపరమైన ప్రయోజనాలపై సాచివేత ధోరణి అవలంభిస్తోంది. ఈ సమస్యలపై పదేపదే ప్రభుత్వానికి, మంత్రుల కమిటీకి ఏపీ జేఏసీ అమరావతి పక్షాన తీసుకెళ్లినా స్పందన లేదు. తుదకు ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన మంత్రుల కమిటీ సమావేశ ప్రతుల్లోనూ ప్రభుత్వం నుంచి వారి హామీలపై ఎలాంటి స్పష్టత లేదు. దీంతో ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు ఉద్యోగులు దశల వారీగా ఉద్యమబాట పట్టారు.

సీఎస్‌ను కలిసిన ఏపీ జేఏసీ అమరావతి నేతలు

రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రిటైర్డు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్య ధోరణికి నిరసనగా ఉద్యోగుల నుంచి వస్తున్న ఒత్తిడితో దశలవారి ఆందోళనల సవరించిన షెడ్యూలును శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి ఏపీ జేఏసీ అందజేసింది. విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో సీఎస్‌ను ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు అధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నేతలు కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఏళ్లుగా ప్రభుత్వం స్పందించకుండా ఉద్యోగుల పట్ల వివక్ష చూపుతోందన్నారు. రెండేళ్లుగా వాడుకున్న ఉద్యోగుల డబ్బులు చెల్లించకపోవడం, ఉద్యోగులకు చట్ట ప్రకారం చెల్లించాల్సిన అన్ని రకాల బకాయిలు, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్లు, మెడికల్ రీయింబర్స్ మెంటు బిల్లులు, డీఏ బకాయిలు, కొత్తగా ఇవ్వాల్సిన డీఏ తదితర ఆర్థికపరమైన అంశాలు పరిష్కారం నోచుకోనందున ఉద్యోగులు

ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వాటితో పాటు ప్రభుత్వమే హామీ ఇచ్చిన సీపీఎస్ రద్దు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపుదల తదితర ఆర్థికేతర అంశాలు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలనే డిమాండ్‌తో ఉద్యమ కార్యాచరణకు దిగినట్లు వివరించారు. ఈనెల 9 నుంచి ఏప్రిల్-5వ తేదీ వరకు నల్ల బ్యాడ్జీలతో నిరసనలు, 17, 20 తేదీల్లో (రెండు రోజులు) ఉద్యమానికి మద్దతు కోరుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాల సందర్శన, 21 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అందరూ ఉద్యోగులు వర్కు టూ రూల్, 27న కారుణ్య నియామకాలు పొందని కుటుంబాల ఇళ్ల సందర్శన తదితర ఆందోళన కార్యక్రమాల షెడ్యూలు నోటీసును సీఎస్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ చైర్మన్ టీవీ ఫణిపేర్రాజు, కోశాధికారి వీవీ మురళీకృష్ణ నాయుడు, బి.కిషోర్ కుమార్, వి.అర్లయ్య, ఎ.సాంబశివరావు, ఎస్.మల్లీశ్వరరావు, బి.జగదీష్ పాల్గొన్నారు.

ప్రతి పథకం...అవినీతి మయం: లోకేశ్

విశాలాంధ్ర-మదనపల్లి రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చే ప్రతి పథకంలో కచ్చితంగా అవినీతి కుంభకోణం ఉంటుందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. యువగళం పాదయాత్ర శుక్రవారం మదనపల్లిలో దేవతానగర్ నుంచి మొదలైంది. ఈసందర్భంగా లోకేశ్‌కు పట్టణ ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మచెరువు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. యువగళానికి ప్రజల నుంచి విశేషంగా స్పందన లభిస్తోందన్నారు. జగన్‌లో ఎన్నికల భయం ఏర్పడిందని అందుకే పొత్తులు లేకుండా ఎన్నికలకు సింగిల్‌గా రావాలని చెబుతున్నారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో అరాచకం, అవినీతి పెచ్చరిల్లాయన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులపైనే కాక సొంత పార్టీ కార్యకర్తలను కూడా వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. విద్యాదీవెన, వసతి దీవెన డబ్బులు ఇంత వరకు వేయలేదని దీంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురౌతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, 2024లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని, మళ్లీ చంద్రబాబే ముఖ్యమంత్రి అవుతారని లోకేశ్ స్పష్టం చేశారు. ముస్లింలను ఆదుకుంది టీడీపీయేనని, టీడీపీ అధికారంలోకి వస్తే వారి కోసం ప్రత్యేకంగా బ్యాంక్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా టీడీపీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈసందర్భంగా షాజహాన్‌బాషాను టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రమేష్, పార్లమెంట్ అభ్యర్థి నరహరి, శ్రీరామ్ చిన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

15 శాతం నిధులు కేటాయించాలి

(మొదటిపేజీ తరువాయి)

అంబటి రాంబాబు దృష్టికి తీసుకువెళతానని అన్నారు. ఆ తర్వాత సీఎం వైఎస్ జగన్ వద్దకూ ఈ సమస్యలను తీసుకువెళతానని సజ్జల హామీ ఇచ్చారు. పోలవరం ఎత్తు తగ్గించకుండా ప్రతిపాదిత ఎత్తుతో నిర్మించాలని, నిర్వాసితులకు పరిహారాన్ని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ప్రకారం చెల్లించాలని సీపీఐ నేతలు కోరగా, దానిపైనా ఆయన సానుకూలంగా స్పందించారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు కావడంతో కేంద్రమే దీని నిర్మాణ బాధ్యత చేపట్టాలని, నిర్వాసితుల పరిహారం సవరించిన అంచనా ప్రకారం చేయాలని, అందుకు కేంద్రంపై ఒత్తిడి పెంచడానికి కేంద్ర ప్రభుత్వం వద్దకు అఖిలపక్షాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువెళ్లి చర్చించాలని సజ్జలకు విజ్ఞప్తి చేశారు. ఎగువ భద్ర నిర్మాణం వల్ల టీబీ డ్యామ్ ద్వారా హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ, కేసీ కెనాల్‌కు జరిగే నష్టాన్ని నివారించడానికి కేంద్రం వద్ద సమర్థవంతమైన వాదనలు వినిపించి, దాన్ని ఆపు చేయించాలన్నారు. గాలేరు-నగరి సుజల స్రవంతి, తెలుగుగంగ, హంద్రీ-నీవా సుజల స్రవంతి, వెలిగొండ ప్రాజెక్టుల క్రింద ఉన్న రిజర్వాయర్ల అసంపూర్తి పనులు ఈ ఏడాదిలో పూర్తి చేసి కరువు ప్రాంతాలను ఆదుకోవాలని కోరారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లబ్ధి చేకూర్చే గుండ్రేవుల, వేదవతి, రాజోలి, సిద్దేశ్వరం, అలుగు నిర్మాణాలకు ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేయాలన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని, వంశధార, నాగావళి నదులపై ఉన్న రిజర్వాయర్‌లను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని కోరారు. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల మెట్ట ప్రాంతాలకు సాగు, తాగు నీరు అందించే చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-1, ఫేజ్-2 లో ఉత్పన్నమైన అనేక భూ సేకరణ సమస్యలను పరిష్కరించి కాలువల నిర్మాణం వెంటనే పూర్తిచేయాలన్నారు. ఈ తీర్మానాలను కాలబద్ధంగా పూర్తి చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సజ్జలకు జల్లి విల్సన్, ఓబులేసు విజ్ఞప్తి చేశారు.

తక్షణమే మహిళలకు 33శాతం కోటా

న్యూఢిల్లీ: బీఆర్ఎస్ నేత కవిత శుక్రవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరాహార దీక్షకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సంఘీభావం తెలిపింది.సీపీఐ కార్యదర్శి కె.నారాయణ, పార్టీ ఢిల్లీ రాష్ట్ర సమితి కార్యదర్శి దినేశ్ వార్ష్నే దీక్షలో పాల్గొని ఆమెకు మద్దతు తెలిపారు. మహిళా రిజర్వేషన్ కోసం దీక్షను చేపట్టిన కవితను నారాయణ అభినందించారు. మహిళా రిజర్వేషన్ కోసం పాటుపడ్డ కమ్యూనిస్టు నాయకులు గీతా ముఖర్జీ చిత్రపటాన్ని ఆమెకు అందజేశారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ నాడు పార్లమెంటరీ కమిటీ చైర్‌పర్సన్‌గా ఉండి మహిళా రిజర్వేషన్ కోసం గీతా ముఖర్జీ కృషి చేశారుగానీ నేటికీ ఈ అంశంలో పురోగతి లేదని అన్నారు. గీతా ముఖర్జీ నేతృత్వ పార్లమెంటరీ కమిటీ మహిళా రిజర్వేషన్‌పై నివేదికను అప్పటి ప్రధాని హెచ్‌డీ దేవగౌడకు అందజేశారని నారాయణ గుర్తుచేశారు. 33శాతం రిజర్వేషన్ ఇన్నేళ్ల తర్వాత కూడా వాస్తవ రూపం దాల్చలేదని ఆందోళన వ్యక్తంచేశారు. 'జీ20 అధ్యక్ష బాధ్యతలను ప్రధాని మోదీ చేపట్టారు. జీ20 అజెండాలోని ప్రాధానాంశాల్లో ఒకటిగా మహిళా సాధికారత ఉంది. కాబట్టి 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే ఆమోదించాలి. సీపీఐ మొదటి నుంచి మహిళా రిజర్వేషన్‌కు మద్దతిస్తోంది. రిజర్వేషన్ సాధించే వరకు పోరాడుతుంది. అధికారంలోకొస్తే మహిళా రిజర్వేషన్ కల్పిస్తామన్న హామీని బీజేపీ మరిచింది. దానిని నెరవేర్చేందుకు ఇదే సరైన సమయం. మోదీజీ... మీరు మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించి, అమల్లోకి తెస్తే సీపీఐ, వామపక్ష పార్టీలు, బీఆర్ఎస్, ఇతర విపక్షాలు అందుకు మద్దతిస్తాయి' అని నారాయణ అన్నారు. తన దీక్షకు మద్దతిచ్చిన నారాయణ, ప్రొఫెసర్ వార్ష్నేకు కవిత కృతజ్ఞతలు తెలిపారు. చివర్లో ఆమెకు నారాయణ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

మహిళా రిజర్వేషన్ సాధించే వరకు విశ్రమించం

(మొదటిపేజీ తరువాయి)

ఉండాలని నొక్కిచెప్పారు. దీక్షలో కె.నారాయణ(సీపీఐ), సీమా శుక్లా (ఎస్పీ), సంజయ్ సింగ్, చిత్రా సర్వర (ఆప్), నరేశ్ గుజ్రాల్ (అకాలీదళ్), అంజుమ్ జావేద్ మీర్జా (పీడీపీ), షామి ఫిర్దోస్ (ఎన్‌సీ), సుష్మిత దేవ్ (టీఎంసీ), కేసీ త్యాగి (జేడీయూ), సీమా మలిక్ (ఎన్‌సీపీ), ప్రియాంక చతుర్వేది (శివసేన), కాంగ్రెస్ మాజీ నేత కపిల్ సిబల్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మహిళ నేతలు పాల్గొన్నారు. మొత్తం 18 పార్టీలు సంఘీభావం ప్రకటించాయి.

ఉపయోగమేది?

(మొదటిపేజీ తరువాయి)

సేవలు బీమాదారులకు అందడంలేదనడం అతిశయోక్తికాదు. బీమా పొందిన కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ప్రాథమిక చికిత్స అందించేందుకు ఏర్పాటు చేసిన ఈఎస్ఐ డిస్పెన్సరీలలో అరకొర సేవలు అందుతున్నాయి. బీమాదారులకు అవసరమైన కనీస మందులు కూడా అందుబాటులో ఉండడంలేదు. రోగనిర్ధారణ పరీక్షలు చేయడం ఎప్పుడో మానేశారు. సీజనల్ మార్పులు, వర్షాలు, వరదలతో అనారోగ్యం పాలవుతున్న కార్మికులు డిస్పెన్సరీలలో మందులులేక, వైద్య పరీక్షలు జరగక పడుతున్న బాధలు వర్ణణాతీతం. కార్మికులకు అవసరమైన వైద్య సేవలు అందజేసేందుకు అయ్యే ఖర్చులో గతంలో ఈఎస్ఐ కార్పొరేషన్, రాష్ట్ర ప్రభుత్వం 87.5:12.5 నిష్పత్తిలో భరించేవి. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మాత్రం నిధులను కూడా ఈఎస్ఐ ఆసుపత్రులకు కేటాయించకపోవడం, కార్పొరేషన్ వద్ద అధిక నిధులు ఉండడంతో కార్మికులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు రెండుమూడేళ్లుగా వ్యయం మొత్తాన్ని ఈఎస్ఐ కార్పొరేషనే దాదాపు భరిస్తోంది. వైద్య సేవలకు అవసరమయ్యే మొత్తాన్ని ఈఎస్ఐ కార్పొరేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తున్నా మందులు సకాలంలో సరఫరా కావడం, ఇతర సదుపాయాల కల్పన మాత్రం మృగ్యం. అయినప్పటికీ యాజమాన్యాల నుంచి నెల వారీ చందా వసూలు చేసే ఈఎస్ఐ కార్పొరేషన్ నిమ్మకునీరెత్తినట్టు ఉంటోంది. వైద్యసదుపాయాల కల్పన రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతని చెప్పి చేతులు దులుపేసుకుంటోంది. తాము నిధులు సమకూర్చినా బీమాదారులకు సేవలు అందకపోవడంపై ఎటువంటి చర్యలు ఉండడంలేదు. యాజమాన్యాలు చెల్లించాల్సిన చందా నిర్ణీత గడువుకన్నా ఒక్కరోజు ఆలస్యమైనా గోళ్లూడగొట్టి ఇంటరెస్టు, డేమేజస్ వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ బీమాదారులకు మందులు, సేవలు అందించడంలో ఇసుమంతైనా చూపించడంలేదు. ఈఎస్ఐసీ 72వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 24 నుంచి మార్చి 10వ తేదీ వరకు నిర్వహించిన 'ప్రత్యేక సేవల పక్షోత్సవం' సందర్భంగానైనా ప్రత్యేక సేవలు అందుతాయనీ, కనీసం ప్రాణావసర మందులు అయినా అందుబాటులోకి వస్తాయని ఆశించిన బీమాదారులకు నిరాశే ఎదురైంది. ఏదో మొక్కుబడి కార్యక్రమాలు తప్ప బీమాదారుల సమస్యలపై ఈ పక్షోత్సవంలో కార్పొరేషన్ అధికారులు ఏమాత్రం దృష్టిసారించలేదు. యోగాభ్యాసం, కార్యాలయాల శుభ్రత, ఫైళ్ల క్లియరెన్స్ వంటి ప్రచారార్భాట కార్యక్రమాలు మాత్రమే ఈ ప్రత్యేక సేవల పక్షోత్సవంలో చోటుచేసుకున్నాయి. ఏటా ఫిబ్రవరి 24 నుంచి మార్చి10వ తేదీ వరకు ప్రత్యేక సేవల పక్షోత్సవం పేరుతో ఈఎస్ఐ కార్పొరేషన్ అధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు, అయితే, అవి బీమాదారుల సదుపాయాల మెరుగుదలకు ఏమాత్రం దోహదపడడంలేదు.

అన్ని ప్రాంతాలలోనూ ఈఎస్ఐ ఆసుపత్రులు ఏర్పాటు చేయలేరు, ఒక వేళ ఏర్పాటు చేసినా బీమాదారులకు అన్ని సేవలు అక్కడ అందించడం సాధ్యంకాదు కనుక బీమాదారులు, వారి కుటుంబ సభ్యులకు ప్రాథమిక వైద్య చికిత్స అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలో కనీసం 3,000 మంది బీమాదారులు ఉన్న ప్రాంతంలో ఈఎస్ఐ డిస్పెన్సరీ, వెయ్యి మంది ఉన్న ప్రాంతాలలో ప్యానల్ క్లీనిక్‌లను ఏర్పాటు చేశారు. అయితే, గత మూడునాలుగేళ్లుగా ప్యానల్ క్లీనిక్‌లనే మర్చిపోయారు. అవి పనిచేయడం మానివేశాయి. డిస్పెన్సరీలలో ప్రాథమిక చికిత్సచేస్తారు. అవసరమైన కేసులను ఈఎస్ఐ ఆసుపత్రులకు రిఫర్ చేస్తారు. అయితే, ఈ డిస్పెన్సరీలు బీమాదారులకు కనీస అవసరాలు సైతం తీర్చడంలేదు. అత్యవసరమైన మందులు, పరీక్షలు ఈ డిస్పెన్సరీలు, ఆసుపత్రులలో అందుబాటులో ఉండడంలేదు. బీమాదారులు ఈఎస్ఐ కంట్రిబ్యూషన్ చెల్లించినప్పటికీ మందులు కొనుక్కోవటం, అవసరమైన పరీక్షలు బయట చేయించుకోవలసి వస్తోంది. డిస్పెన్సరీలు, ఈఎస్ఐ ఆసుపత్రులలో రక్త పరీక్షలు నిర్వహించడానికి కూడా అవసరమైన మెటీరియల్ ఏళ్ల తరబడి ఉండడంలేదు. దానితో బీమాదారులు బయటకు వెళ్లి డబ్బు వెచ్చించి పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోంది. చాలా నెలలుగా డిస్పెన్సరీలకు మందుల సరఫరా అరకొరగా జరుగుతోంది. దీనితో బీమాదారులకు కేవలం కన్సల్టేషన్ ఫీజు మాత్రమే మిగులుతోంది తప్ప పూర్తి వైద్యసేవలు అందడంలేదు. సీజనల్ మార్పులు, ఎండలు, ఇతర కారణాలతో అనారోగ్యం పాలవుతున్న కార్మికులు డిస్పెన్సరీలలో మందులులేక, వైద్య పరీక్షలు జరగక పడుతున్న బాధలు వర్ణణాతీతం.

గత ప్రభుత్వ హయాంలో ఈఎస్ఐ డిస్పెన్సరీలలో సరఫరా చేసేందుకు మందుల కొనుగోలులో భారీ అవినీతి జరిగిన నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న చర్యలు కొండనాలికకు మందేస్తే ఉన్న నాలిక ఊడినట్టుగా ఉన్నాయి. మందుల కొనుగోలులో అక్రమాలను సరిచేయాలనే ఉద్దేశంతో బీమా వైద్యసేవల డైరెక్టర్ (డీఐఎంఎస్)గా ఐఆర్ఎస్ అధికారిని నియమించినా ఫలితం శూన్యం. డీఐఎంస్‌గా ఐఆర్ఎస్ అధికారి బాధ్యతలు చేపట్టిన తరువాత ఈఎస్ఐ ఆసుపత్రులలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడంతో పరిస్థితులు మారుతాయని అందరూ భావించారు. అయితే, కొద్ది రోజులలోనే ఆ ఆశలు నీరుగారిపోయాయి.

మందుల కొనుగోలులో అక్రమాల నేపథ్యంలో గతంలో ఉన్న పద్ధతికి బదులుగా ఆన్‌లైన్ ఇండెంట్ విధానం తీసుకువచ్చారు. గత 48 సంవత్సరాలుగా జాయింట్ డైరెక్టర్ (జేడీ) కార్యాలయం నుంచి మందులను కొనుగోలు చేసి తమ పరిధిలోని ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీలకు పంపించేవారు. జాయింట్ డైరెక్టర్లు ఎప్పటికప్పుడు మందుల కంపెనీల వారిని, డిస్ట్రిబ్యూటర్లను ఫాలోఅప్ చేసి మందులు సకాలంలో వచ్చేలా చూసేవారు. అయితే, జేడీ కార్యాలయం నుంచి మందుల కొనుగోలులో అనేక అక్రమాలు చోటుచేసుకోవడంతో ఆ పద్ధతికి ఫుల్‌స్టాప్‌పెట్టి ఈఎస్ఐ ఆసుపత్రుల సూపరింటెండెంట్ల నేతృత్వంలో సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ (సీడీఎస్) ఏర్పాటు చేసి దాని ద్వారా మందుల కొనుగోలు ప్రారంభించారు. ఈ విధానం పూర్తిగా వైఫల్యం చెందింది. మందుల కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లతో సూపరింటెండెంట్లకు సంబంధాలు లేకపోవడం, కొంతమంది సూపరింటెండెంట్లు అలసత్వంతో వ్యవహరించడం వల్ల సీడీఎస్ విధానం ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. దానితో ఈఎస్ఐ డిస్పెన్సరీలు, ఆసుపత్రులలో మందులు లభ్యంకావడంలేదు. అత్యవసరమైన గుండె, కిడ్నీ, క్యాన్సర్ తదితరాలకు సంబంధించిన మందులు సైతం ఆసుపత్రులలో అందుబాటులో ఉండడంలేదు. సుగరు, బీపీ, గ్యాస్, ఐరన్, విటమిన్ వంటి బేసిక్ డ్రగ్స్ కూడా డిస్పెన్సరీలలో అందుబాటులో ఉండడంలేదు. ఒకటోరెండో రకాలు ఉన్నా అవి నాసిరకానివీ, లేదా తక్కువ ప్రమాణాలు కలిగినవి ఉంటున్నాయి. ఏపని జరగాలన్నా ఎస్ఈసీ సమావేశం జరపాలని డీఐఎంఎస్ అంటున్నారు. అయితే, ఆ సమావేశాన్ని జరపాల్సిన బాధ్యత ఆయనమీదే ఉంది, ఆ దిశగా ఆయన చర్యలు తీసుకోవడంలేదు.

కనుక డిస్పెన్సరీలలో కనీస అవసరమైన మందులనైనా అధికారులు తక్షణం అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది. కార్పొరేషన్ కేవలం నిధులు ఇచ్చి చేతులు దులుపుకోవడం కాకుండా ఆ నిధులు ఖర్చుచేసి మందులు కొనుగోలు చేసి బీమాదారులకు అందుబాటులో ఉంచేవిధంగా చూడాలి. అలాగే పరీక్షలు నిర్వహించడం తిరిగి ప్రారంభించాలి. మందులు కొనుగోలు చేసే సమయంలో గడువు ఎక్కువ కాలం ఉన్న వాటిని, అవసరమైన మందులను ఎక్కువగా తెప్పించాల్సిన అవసరం ఉంది. అదే విధంగా డిస్పెన్సరీల్లోనే ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించేలా పరికరాలు, కిట్‌లను అందుబాటులో ఉంచాలి. ఈఎస్ఐ కార్పొరేషన్ నిర్వహించే ప్రత్యేక సేవల పక్షోత్సవంలో బీమాదారుల సమస్యలు పరిష్కరించే కార్యక్రమాలకు ప్రాధాన్యతనివ్వాలి. బీమాదారులకు ఉపయోగపడే విధంగా ఆ కార్యక్రమాలు ఉండాలి.

విద్యా, గృహ రుణాలు తక్కువే

- రెండు రంగాలపై సానుకూల దృక్పథం అవశ్యం
- ఉపాధి కల్పనపైనా దృష్టి పెట్టాలి
- 22వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యా, గృహ నిర్మాణ రంగాలకు సంబంధించి నిర్దేశించుకున్న లక్ష్యాల స్థాయి కన్నా రుణాలు తక్కువగా ఉన్నాయని, విద్యారంగానికి 42.91శాతం, గృహనిర్మాణ రంగానికి 33.58శాతమే రుణాలిచ్చినట్లు సీఎం జగన్ తెలిపారు. సామాజిక, ఆర్థిక ప్రగతిలో ఈ రెండు రంగాలు కీలకమన్నారు. బ్యాంకింగ్ రంగం వాటిపై మరింత సానుకూల దృక్పథంతో, అనుకూల కార్యాచరణతో ముందడుగు వేయాలని సూచించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో 22వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జగన్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సీఎం మాట్లాడుతూ గృహనిర్మాణ రంగంలో బ్యాంకులు మరింత ఊతమివ్వాలన్నారు. వివిధ రంగాలకు సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. 30.75లక్షల ఇళ్ల పట్టాలను పంపిణీ చేశామని చెప్పారు. ప్రభుత్వమే ఇళ్లస్థలాలు సేకరించి, లబ్ధిదారులకు ఉచితంగా ఇచ్చిందన్నారు. స్వల్పకాలిక పంట రుణాల విషయంలో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చూస్తే 83.36శాతం మాత్రమే చేరుకున్నామని, ఇందుకు కారణాలపై దృష్టి పెట్టి ఎస్ఎల్బీసీ సరైన చర్యలు తీసుకోవాలన్నారు. విత్తనం నుంచి పంట విక్రయం దాకా తోడుగా నిలిచే ఆర్బీకే వ్యవస్థ రాష్ట్రంలో సమర్థంగా ఉందన్నారు. కౌలు రైతులకు రుణాలపై ఎలాంటి సందేహాలు బ్యాంకులకు అక్కర్లేదన్నారు. తమ వద్దనున్న డేటా ఆధారంగా కౌలు రైతులకు ఇచ్చే రుణాలను గణనీయంగా పెంచాలని కోరారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే రుణాలపై వడ్డీలను పున:పరిశీలించాలని బ్యాంకులకు జగన్ సూచించారు. చిరు వ్యాపారులు, సాంప్రదాయ చేతివృత్తుల వారి అవసరాలను తీర్చడానికి 'జగనన్న తోడు' పథకాన్ని తెచ్చామన్నారు. రూ.10వేల చొప్పున రుణా లిస్తూ... వాటిపై వడ్డీ భారాన్ని పూర్తిగా రాష్ట్రప్రభుత్వమే భరిస్తోందని చెప్పారు. యువతలో నైపుణ్యాభివృద్ధికి, ఉపాధి కల్పనకు ప్రతి నియోజకవర్గంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడానికి యత్నిస్తున్నట్లు తెలిపారు. ఎంఎస్ఎంఈలు రాష్ట్ర సామాజిక, ఆర్థిక పురోగతికి ఎంతో తోడ్పడతాయని, ఉపాధి కల్పనలో ఈ రంగం ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని బ్యాంకులు సహకరించాలని సీఎం అన్నారు. చిన్న సంస్థల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యాపార అనుకూల వాతావరణం, దృఢమైన మౌలిక సదుపాయాల లభ్యత, నైపుణ్యం కలిగిన మానవశక్తి, స్వాభావిక సహజ ప్రయోజనాల కారణంగా ఈనెల 3,4 తేదీల్లో విశాఖ పట్నంలో ప్రపంచ పెట్టుబడుదల సదస్సుకు అద్భుత స్పందన లభించిందన్నారు. 352 ఎంఓయూలు కుదిరాయని, రూ.13,05,663 కోట్లు పెట్టుబడులు, 6,03,223 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నా యని సీఎం చెప్పారు. వారికి రుణ సౌకర్యాన్ని కల్పించేం దుకు బ్యాంకులు ముందుకు రావాలని కోరారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక సీఎస్ అజయ్ జైన్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక సీఎస్ వై.శ్రీలక్ష్మి, ఆర్థిక శాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శి ఇంతియాజ్, ఏపీ టిడ్కో ఎండీ శ్రీధర్, వ్యవసాయశాఖ కమిషనర్ హరికిరణ్, ఏపీఐఐసీ వీసీ&ఎండీ జి.సృజన, ఇతర ఉన్నతాధికారులు, ఎస్ఎల్బీసీ అధ్యక్షుడు, యూనియన్ బ్యాంకు ఎండీ అండ్ సీఈఓ మణిమేకలై, ఎస్ఎల్బీసీ కన్వీనర్ నవనీత్ కుమార్, నాబార్డు సీజీఎం గోపాల్, ఆర్బీఐ డీజీఎం ఏపీ, వికాస్ జైస్వాల్, మరికొందరు బ్యాంకర్లు పాల్గొన్నారు.

కత్తి, పోతులను గెలిపించండి

కర్నూలు జిల్లాలో రామకృష్ణ విస్తృత ప్రచారం

విశాలాంధ్ర బ్యూరో -కర్నూలు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ శుక్రవారం కర్నూలు జిల్లాలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కోడుమూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆదోని నియోజకర్గాల్లో ఆయన పర్యటించి ఉపాధ్యాయులు, మేధావులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరులో మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, పత్తికొండలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కె.ఈ శ్యాంబాబుతో పాటు టీడీపీ నాయకులతో కలిసి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ ప్రచారం చేశారు. పోతుల నాగరాజుకు రెండో ప్రాధాన్యత ఓటు వేసే విధంగా టీడీపీ శ్రేణులకు పిలుపునివ్వాలని కోరారు. ఈ పర్యటనలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి. రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు, ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఈ.శ్రీరాములు, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పోలీసు కానిస్టేబుల్ ఫిజికల్ ఈవెంట్స్ (దేహదారుఢ్య) పరీక్షలను ఏపీ పోలీస్ నియామక మండలి వాయిదా వేసింది. రాష్ట్రంలోని 6,100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ఇటీవల ప్రాథమిక పరీక్ష నిర్వహించారు. ఇందులో అర్హత సాధించిన వారికి ఈనెల 14 నుంచి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించేలా షెడ్యూలు జారీచేశారు. అయితే అసెంబ్లీ సమావేశాలు, ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా వాటిని వాయిదా వేసినట్లు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ మనీశ్‌శర్మ తాజా ప్రకటనలో తెలిపారు. కొత్త తేదీలను తర్వాత ప్రకటిస్తామన్నారు. అభ్యర్థులు తేదీల కోసం పోలీసు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది. కానిస్టేబుల్ పోస్టుల ఎంపిక కోసం జనవరి 22న ప్రాథమిక పరీక్షను నిర్వహించగా, దీనికి 4,59,182 మంది హాజరయ్యారు. ఇందులో 95,209 మంది (20.73శాతం) అర్హత సాధించారు. దీంతో ఒక్కో పోస్టుకు 16మంది పోటీపడుతున్నారు. ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన వారిలో 77,876 మంది పురుషులు, 17,332 మంది మహిళలు ఉన్నారు. వారంతా రెండో విడత పరీక్షల కోసం ఫిబ్రవరి 13 నుంచి 20 వరకు పోలీసు నియామక మండలి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దేహదారుఢ్య పరీక్షల సమయంలోనే అభ్యర్థుల ధ్రువపత్రాలనూ పరిశీలిస్తారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర స్థాయి సమ్మేళనాలు జయప్రదం చేయండి

ఈశ్వరయ్య, జంగాల, పరుచూరి పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: దేశయువతలో ప్రగతిశీల అభ్యుదయ భావాలను, దేశభక్తి, ప్రజాస్వామిక ఆలోచనలు, నైతిక విలువలు, మానవత్వాన్ని మేల్కొల్పడానికి అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నిరంతరం కృషి చేస్తున్నదని ఏఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జంగాల అజయ్ కుమార్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర తెలిపారు. శుక్రవారం గుంటూరు, కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకుడు మాట్లాడుతూ ఏప్రిల్‌లో ఐదు రోజులు జరిగే అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ, సాంస్కృతిక సమ్మేళనాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగులు, యువత, విద్యార్థులు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ రూప కల్పనకు అనుభవజ్ఞులైన రాజకీయ నేతలు, అధ్యాపకులు, విద్యావంతులు, కళాకారులతో గుంటూరులో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం, ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ సంతోష్ కుమార్, సీపీఐ కార్యదర్శి కె.నారాయణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుక్కిందర్ మహేశరీ, ఆర్.తిరుమలై రామన్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ప్రముఖ వాగ్గేయకారులు గోరేటి వెంకన్న, వందేమాతరం శ్రీనివాస్, వీక్షణం సంపాదకులు వేణు గోపాల్, ప్రొఫెసర్ ఖాసీం, ప్రొఫెసర్ నాగేశ్వర్, డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, విద్యావేత్తలు హాజరవుతారని తెలిపారు. 26 జిల్లాల నుంచి యువజన సమాఖ్య కార్యకర్తలు పాల్గొంటారన్నారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ సుభాని, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, నగర కార్యదర్శి చల్లా మరియదాసు, అరుణ్, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల కొండపై బోగస్ ఓట్లు తొలగించండి: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుమల కొండపై ఎమ్మెల్సీ ఎన్నికల బోగస్ ఓట్లను తొలగించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో)కు ఆయన శుక్రవారం ఒక లేఖ రాశారు. చాలా రోజులుగా తిరుపతి సీఐటీయూ వారి పరిశీలనలో గుర్తించిన బోగస్ ఓట్లను అధికారుల దృష్టికి, ఎన్నికల సంఘం దృష్టికి తెస్తున్నట్లు తెలిపారు. తిరుమల కొండపై దీర్ఘకాలికంగా రౌడీ షీటర్లుగా ఉన్న బెల్లం రమేశ్, సోమశేఖర్‌కు పట్టభద్రుల ఓటు ఉండడాన్ని గుర్తించారు. పోలింగ్ బూత్ నం-230లో వరుస నెంబరు 408, 490లో వారి పేర్లు నమోదయ్యాయి. సీఐటీయూ నేతల పరిశీలనలో వారిద్దరూ డిగ్రీ చదవలేదని తేలింది. అందులో ఒకరు ఐదో తరగతి, మరొకరు 10వ తరగతి కూడా పూర్తి చేయలేదు. పట్టభద్రుల ఓటరు జాబితాలో వారి ఫోటోలతో సహా ప్రచురించారు. ఈ వివరాలను రిటర్నింగ్ అధికారికి ఆధారాలతో సహా ఇచ్చాం. పోలింగ్ సమీపిస్తుండటంతో తక్షణమే స్పందించి బోగస్ ఓట్లను తొలగించేందుకు సీఈవోగా తగిన చర్యలు తీసుకుంటారని ఆకాంక్షిస్తున్నాం' అని లేఖలో శ్రీనివాసరావు పేర్కొన్నారు.

అవినాష్‌రెడ్డికి స్వల్ప ఊరట

సోమవారం వరకు అరెస్టు చేయొద్దని సీబీఐకి తెలంగాణ హైకోర్టు ఆదేశం

హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కడప ఎంపీ అవినాష్ రెడ్డికి హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. సోమవారం వరకూ ఆయన్ను అరెస్ట్ చేయొద్దని సీబీఐని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సోమవారం విచారణ సమయంలో కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు సమర్పించాలని దర్యాప్తు సంస్థను న్యాయస్థానం ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో సోమవారం వరకూ వైఎస్సార్సీపీ నేతకు ఊరట లభించినట్లే. సీబీఐ తనపై తీవ్రమైన చర్యలు తీసుకోకుండా ఆదేశించాలని అవినాష్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. తీవ్రమైన చర్యలంటే ఏంటని న్యాయస్థానం ఆయన్ను ప్రశ్నించింది. అరెస్ట్ చేయకుండా ఆదేశించాలని కోరుతున్నారా? అని అడిగింది. దీనికి అవినాష్ తరపున న్యాయవాది స్పందిస్తూ... సీబీఐ అధికారులు వాంగ్మూలం నమోదు చేస్తున్న తీరుపై అనుమానం వ్యక్తం చేశారు. చెప్పింది చెప్పినట్లుగా చేస్తున్నారనే నమ్మకం తమకు లేదన్నారు. దీనికి సీబీఐ తరపు న్యాయవాది స్పందిస్తూ... విచారణను వీడియో రికార్డింగ్ చేస్తున్నామని చెప్పారు. వీడియో రికార్డింగ్ ఏ దశలో ఉందని న్యాయస్థానం ప్రశ్నించగా... ఆడియో, వీడియో రికార్డులకు సంబంధించిన హార్డ్ డిస్క్‌ను ఇప్పుడే కోర్టుకు ఇస్తామని సీబీఐ ఎస్పీ రామ్ సింగ్ తెలిపారు. దీనికి న్యాయస్థానం స్పందిస్తూ... సోమవారం సీల్డ్ కవర్‌లో హార్డ్ డిస్క్‌తోపాటు అవిష్ రెడ్డి వివరాలు ఇవ్వాలని సీబీఐని ఆదేశించింది. అప్పటి వరకూ ఎంపీని అరెస్ట్ చేయొద్దని ఆయన తరఫున న్యాయవాది కోర్టును కోరారు. ఈ కేసులో అవినాష్ రెడ్డితోపాటు ఆయన తండ్రి భాస్కర్ రెడ్డిని అదుపులోకి తీసుకునే అవకాశం ఉందని సీబీఐ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనికి న్యాయస్థానం స్పందిస్తూ... సోమవారం వరకు ఎంపీని అరెస్ట్ చేయొద్దని ఆదేశించింది. అవసరమైతే ఆయన మంగళవారం మరోసారి కోర్టు ముందు హాజరవుతారని తెలిపింది. కాగా వివేకా హత్య కేసులో అవినాష్ రెడ్డి మరోసారి సీబీఐ విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టులో ఆయన మూడోసారి విచారణకు హాజరయ్యారు. జనవరి 28న తొలిసారి, ఫిబ్రవరి 24న రెండోసారి ఆయన సీబీఐ ముందుకొచ్చారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి

- పెద్దల సభ మర్యాద, గౌరవం కాపాడండి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-నంద్యాల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులు కత్తి నర్సింహారెడ్డి, పోతుల నాగరాజును గెలిపించాలని, పెద్దల సభ మర్యాద, గౌరవాన్ని కాపాడాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. నంద్యాల జిల్లాలో శుక్రవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. బనగానపల్లె, ఆళ్లగడ్డ, డోన్, నంద్యాల తదితర ప్రాంతాల్లో పర్యటించి ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆళ్లగడ్డలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియను కలసి కత్తి నర్సింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని, అలాగే పోతుల నాగరాజుకు మద్దతు ఇవ్వాలని కోరారు. బనగానపల్లెలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డిని కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగు తున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం రాజకీయ, ఆర్థిక బలంతో, అధికార దర్పంతో తన అభ్యర్థులను గెలిపించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని విమర్శించారు. రాజ్యాంగబద్ధంగా కల్పించిన గవర్నర్ కోటాలోని ఎమ్మెల్సీలను కూడా వీరు మంత్రుల పీఏలకు, తమ తాబేదార్లకు అంటగట్టడం, ఏయూ వైస్ ఛాన్సలర్ వైసీపీ ఎంపీలతో సమావేశం నిర్వహించి ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారి హోదాలో ఆర్జేడీ విద్యాశాఖ సమావేశం అంటూ ఎన్నికల ప్రచారం నిర్వహించడం వైసీపీ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు త్వరలో వస్తాయని, అధికారం, డబ్బు, పలుకుబడి ఉందంటూ అన్ని స్థానాలు గెలుస్తానంటూ విర్రవీగుతున్నారని, ఈ ఎన్నికల్లో విద్యావం తులైన ఉపాధ్యాయులు, మేధావులు, పట్టభద్రులు అధికార పార్టీ అభ్యర్థులను చిత్తుగా ఓడించి, పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించి తమ సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, ఎస్టీయూ నాయకులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రూ.1.89 కోట్ల నగదు స్వాధీనం

హవాలా ముఠా అరెస్టు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: ఆపరేషన్ అనంత పేరిట హవాలా సొమ్ముపై అనంతపురం పోలీసులు ఉక్కుపాదం మోపుతు న్నారు. తాజాగా కేరళకు చెందిన దోపిడీ ముఠా ఆగడాలకు చెక్ పెట్టారు. వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని రూ.1.89 కోట్ల నగదు, రెండు కార్లు, ఐదు మొబైల్స్, 13 నంబరు ప్లేట్లు స్వాధీనం చేసుకు న్నారు. ముట సభ్యుల కొలపురంబిల్ అబు నిషాద్ (40) , జాక్సన్ ఫిలిప్ (29), కన్నన్ రియాగు (25), ఓతవాత్ షమీం (38)ను అరెస్టు చేశారు. హవాలా-దోపిడీలలో పేరు మోసిన శ్రీధరన్ ఆధ్వర్యంలో కొన్ని గ్యాంగులు ఈతరహా దోపిడీలు చేస్తున్నట్లు అనంతపురం పోలీసులు తెలిపారు. 400 కిలో మీటర్ల పరిధిలో ఉన్న వందలాది కెమేరాలను పరిశీలించిన పోలీసులు, 40 టోల్ గేట్ల నుంచి వేలాది వాహనాల నెంబర్ ప్లేట్లు, వాహనాల రాకపోకల సమాచారం సేకరించారు. 25 పోలీసు బృందాలు రాష్ట్రవ్యాప్తంగా దర్యాప్తు చేసి ఈ మేరకు సమాచారం రాబట్టిన జిల్లా ఎస్పి డా.ఫక్కీరప్ప కాగినెల్లి వెల్లడించారు. ఐపీఎస్ పర్యవేక్షణలో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, డీఎస్పీలు జి.ప్రసాదరెడ్డి, బి శ్రీనివాసులు, ఎస్.మహబూబ్ బాషా ఆధ్వర్యంలో 100 మందికిపైగా పోలీసులు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారన్నారు.

భారీగా గంజాయి స్వాధీనం

10 మంది అరెస్ట్

విశాలాంధ్ర-నంద్యాల: నంద్యాల జిల్లా బండి ఆత్మకూర్ పోలీసు స్టేషన్ పరిధిలో 21 కేజీల గంజాయి స్వాధీనం చేసుకొని, 10 మందిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. విశాఖ జిల్లా చింతపల్లి గ్రామానికి చెందిన రాజారావు, విజయవాడకు చెందిన పద్మ ఇద్దరు గంజాయి వ్యాపారం చేస్తుంటారు. వీరి నుంచి బండి ఆత్మకూరు మండలం, ఏ కోడూరు గ్రామానికి చెందిన షేక్ ఖైరూన్ బీ, కుమారుడు షేక్ హుస్సేన్ బాషా కేజీ రూ.7500 చొప్పున గంజాయిని కొనుగోలు చేసి, మరల దానిని కేజీ రూ.12,500ల చొప్పున పాణ్యంకు చెందిన మల్లికార్జున, నంద్యాల గుడిపాటి గడ్డకు చెందిన గజ్జి శివ, నంద్యాల నూనెపల్లికి చెందిన చాకలి నరసింహులు, ఆత్మకూరుకు చెందిన ఎస్తెరమ్మలకు అమ్ముతుంటారు. కాగా కొంతమంది ఖైరూన్ బీ, హుస్సేన్ బాష వద్దకు వచ్చి గంజాయి కొనుక్కొని వెళుతుంటారు. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన కొంత మంది కోడూరు గ్రామంలోని ఖైరూన్ బీ ఇంట్లో ఉన్నారని సమాచారం అందడంతో నంద్యాల రూరల్ సీఐ రవీంద్ర, ఎస్ఐ బాబు, ఏఎస్ఐ అక్బర్ హుస్సేన్, సిబ్బంది వెంకటేశ్వర్లు, శివానందం, మాబువలి, గంగారావు, సుభాన్, శివలింగం... బండి ఆత్మకూరు మండల తహసీల్దారు ఉమారాణి, వీఆర్ఓల సమక్షంలో షేక్ ఖైరూన్ బీ ఇంట్లో తనిఖీలు జరిపి 21 కేజీల గంజాయినీ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ముద్దాయిలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచినట్లు ఎస్పీ తెలిపారు.

ఏనుగుల సమస్య పరిష్కరించండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పార్వతీపురం మన్యం జిల్లాలో ఏనుగుల బీభత్సంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, వాటిని జంతు సంరక్షణ కేంద్రం(జూ)కు గాని, అడవిలోకి గాని తరలించి వెంటనే సమస్యను పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి శుక్రవారం ఆయన ఒక లేఖ రాశారు. ఆరేళ్ల నుంచి ఏనుగులు ఒడిశా నుంచి పాలకొండ మీదుగా నాగావళి నది పరీవాహక ప్రాంతంలో తిష్టవేసి పార్వతీపురం మన్యం జిల్లాలో ఇప్పటివరకు 14 మంది ప్రాణాలను బలితీసు కుంటూ, దాదాపు రూ.5 కోట్ల విలువ చేసే పంటలను ధ్వంసం చేశాయని, ఏ రోజు, ఏ గ్రామంలో పడి దాడి చేస్తాయోనని పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. అటవీ శాఖాధికారులు ఏనుగులను రాత్రి, పగలు కాపలా కాస్తూ ప్రజలు ప్రాణాలను, ఆస్తులు కొంతవరకు కాపాడే పరిస్థితి ఉందేగానీ, ఏనుగులు తరలించడంలో శ్రద్ధ చూపడం లేదన్నారు. ఎవరైనా ఏనుగులు వల్ల చనిపోతే ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల నష్టపరిహారం కింద ప్రకటించి, దానిని రెండు విడతలుగా ఇవ్వడమే తప్ప, ఏనుగుల అదుపునకు చర్యలు తీసుకోలేదని, ఏనుగుల వల్ల ప్రజలకు, రైతులకు, వారు పండించిన పంటలకు భరోసా లేకుండా పోయిందని వివరించారు. ఏనుగుల విషయంలో సీఎం జగన్ వెంటనే స్పందించి వాటిని అడవికి గాని, జూకు గాని తరలించి రైతుల ప్రాణాలను, రైతులు పండించిన పంటలను, వ్యవసాయ సామగ్రిని కాపాడాలన్నారు. ఇప్పటికే అనేక సార్లు సీపీఐ అధ్వర్యంలో నిరసనలు చేపట్టడంతో పాటు జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశామ తెలిపారు. గత ఆరేళ్లుగా అటు ఒడిశా నుంచి అక్రమంగా శ్రీకాకుళం జిల్లా మీదుగా కురుపాం నియోజకవర్గానికి వచ్చిన ఏనుగుల వల్ల నేటికీ (రైతులు, యువకులు, అటవీ విభాగం వారు) 14 మంది చనిపోయారన్నారు. ఏనుగుల దాడి వల్ల వరి, చెరకు, బొప్పాయి, అరటి, ఇతర వాణిజ్య పంటలకు దాదాపు రూ.5 కోట్ల వరకు నష్టం వాటిల్లిందని, ఆవులు, మూగజీవులు చనిపో తున్నాయని, దీనిపై అటవీ శాఖాధికారులు పటిష్ట చర్యలు ఏవీ తీసుకోలేదని పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అధికారి పార్టీ డిప్యూటీ సీఎం, ముగ్గురు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రి, ప్రస్తుత మంత్రి ఉన్నప్పటికీ ఈ ఏనుగుల విషయంలో అసెంబ్లీలో ఒక్క మాటా ప్రస్తావించక పోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్ స్పందించి ఏనుగులను అడవికి లేదా జూకు తరలించి ప్రజల, రైతులు ప్రాణాలను, పంటలను, వ్యవసాయ సామగ్రిని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ లేఖ ప్రతిని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి ఈశ్వరయ్య పంపారు.

స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం

పంటల మద్దతు ధర గ్యారెంటీ చట్టం తేవాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం: స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకువచ్చి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలో శుక్రవారం చుండూరు సుబ్బారావు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. జిల్లాలో ప్రధాన పంటలైన మామిడి, టమాట, సుబాబుల్, జామాయిల్ రైతులను ఆదుకోవడానికి మైలవరంలో మామిడి, జి.కొండూరులో టమాట జ్యూస్, నందిగామ ప్రాంతంలో పేపరు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఎన్టీఆర్ జిల్లా కమిటీ సమావేశం తీర్మానించింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో రోజుకి 28 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, గిట్టుబాటు ధరలు లేక, విపత్తులు, చీడపీడలు వలన పంట దిగుబడులు తగ్గి, పెట్టుబడులు కూడా రాక రైతులు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయారన్నారు. ప్రతి రైతు కుటుంబంపై రూ.2,45,700లు అప్పు ఉందని చెప్పారు. కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం తెచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలో ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేయాలని, 21రోజుల్లో నగదును రైతు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీల అమలు కోసం మార్చి 20న తలపెట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమ లయ్య మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ఆంధ్రప్రదేశ్ పంట సాగుదార్ల హక్కుల చట్టాన్ని సవరించాలని, భూ యజమాని ప్రమేయం లేకుండానే గ్రామసభలు నిర్వహించి కౌలురైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. భూమి లేని కౌలురైతులందరికి రైతు భరోసా అందించాలని కోరారు. డబల్ ఫైనాన్స్‌తో సంబంధం లేకుండానే కౌలురైతులకు పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. మార్చి 28న విజయవాడలో జరిగే కౌలురైతుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

చింతలపూడి ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించాలి

ఎన్టీఆర్ జిల్లా సీపీఐ కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ... చింతలపూడి ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించి, ఫేజ్-1,ఫేజ్-2 పూర్తి చేయడం ద్వారా సాగునీరు, తాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. వేదాద్రి ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేయకపోవడంతో 15వేల ఎకరాల ఆయికట్టులోని పంటలు ఎండి పోతున్నాయని, సాగర్ జలాలను రప్పించి పంటలను కాపాడాలని, జిల్లాలో ఉన్న నీటి ప్రాజెక్టులను అన్నిటినీ పూర్తి చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లా రైతుసంఘం జిల్లా కార్యదర్శి మల్నీడు యలమందారావు మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరి స్తున్న విధానాలకు వ్యతిరేకంగా రైతులందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

నూతన కన్వీనింగ్ కమిటీ

ఈ సమావేశంలో 9మందితో నూతన కన్వీనింగ్ కమిటీని, కమిటీ కన్వీనర్‌గా మల్నీడు యలమందారావును, కో కన్వీనర్లుగా చుండూరు సుబ్బారావు, నృసింహాద్రీ వనమాలిని ఎన్నుకుంది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బుద్ధి రమేష్, తూము కృష్ణయ్య, వల్లంకొండ బ్రహ్మం, పోన్నెం నరసింహారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు చిలుకూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కులగణన చేపట్టాలి: డీహెచ్‌పీఎస్, కేవీపీఎస్

14న రౌండ్ టేబుల్ సమావేశం జయప్రదానికి పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు: జనాభా లెక్కల సమయంలో కుల గణన కూడా చేపట్టాలని, ఎస్సీఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14 వ తేదీన డీహెచ్‌పీఎస్, కేవీపీఎస్ అధ్వర్యంలో గుంటూరులోని మల్లయ్యలింగం భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు డీహెచ్‌పీఎస్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కరవది సుబ్బారావు, ఆండ్ర మాల్యాద్రిలు ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలను అరికట్టాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ వంటి కీలక డిమాండ్ల సాధనకు ఏఐడీఆర్ఎం, డీఎస్ఎంఎం, ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాలు జాతీయస్థాయి ఉద్యమం చేపట్టాలని నిర్ణయించాయన్నారు. అందులో భాగంగా 14న గుంటూరులో నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశంలో ఉభయ వ్యవసాయ కార్మిక, దళిత, గిరిజన ప్రజాసంఘాల ప్రతినిధులు, అభ్యుదయవాదులు, ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఏపీ అగ్నిమాపక దళ అదనపు డీజీగా సునీల్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక దళ, విపత్తుల అదనపు డీజీగా పీవీ సునీల్‌కుమార్ శుక్ర వారం విజయవాడలోని రాష్ట్ర కార్యాల యంలో బాధ్యతలు స్వీకరించారు. 1993 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సునీల్ కుమార్ ఏపీ సీఐడీ డీజీగా పనిచేశారు. ఈ బాధ్యతల నుంచి తప్పించిన కొంత కాలం తర్వాత అగ్నిమాపకదళ డీజీగా ఆయనను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీజేశారు. దీంతో అగ్నిమాపక దళ అదనపు డీజీగా సునీల్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

సంపాదకీయం

సమైక్య పోరుకు బదులు ఏకపాత్రాభినయం

ఉమ్మడి శత్రువును ఓడించడానికి సమైక్య పోరాటం చేయవలసిన తరుణంలో కొన్ని ప్రతిపక్ష పార్టీలు ఒంటరి బాట ఎంచుకుంటున్నాయి. మహానాటకానికి తెరతీయవలసిన పరిస్థితుల్లో ఏకపాత్రాభినయం చేయడం అంటే ఇదే. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ 2024 సార్వత్రిక ఎన్నికలలో తృణమూల్ పార్టీ ఎవరితోనూ పొత్తు పెట్టుకోకుండా అన్ని సీట్లకు ఒంటరిగానే పోటీ చేస్తామంటున్నారు. ఉత్తర ప్రదేశ్‌లో బలం ఉన్న అఖిలేశ్ యాదవ్ నాయకత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ కూడా మొత్తం 80 స్థానాలకు పోటీ చేస్తామంటోంది. మాయావతి నాయకత్వంలోని బహుజన సమాజ్ పార్టీకూడా 80 సీట్లలో పోటీ చేస్తుందట. తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు జాతీయ రాజకీయాలలో కీలకపాత్ర పోషించాలన్న సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర సమితి పేరు భారత రాష్ట్ర సమితిగా మార్చేసి తమది జాతీయ పార్టీ అయిపోయిందంటున్నారు. ఆ పార్టీ లోకసభ ఎన్నికలలో ఇతర రాష్ట్రాలలో కూడా పోటీ చేయడానికి ప్రయత్నించ వచ్చు. కానీ భారత రాష్ట్రసమితికి అపూర్వమైన రీతిలో స్వాగత తోరణాలు కట్టిన దాఖలాలులేవు. అందువల్ల కె.సి.ఆర్. పార్టీ కూడా ఇతర రాష్ట్రాలలో పోటీచేస్తే అది దాదాపుగా ఒంటరి పోటీనే అవుతుంది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర తరవాత ఎక్కువ లోకసభ స్థానాలు ఉన్న రాష్ట్రం బెంగాల్. అలాంటప్పుడు మమతా బెనర్జీ ఒంటరి పోరాటం చేస్తామనడం ప్రతిపక్ష ఐక్యతకు మొహం తిప్పేసినట్టే. నిజానికి 2021లో బెంగాల్ శాసనసభ ఎన్నికలలో తృణమూల్ కాంగ్రెస్ నాలుగింట మూడువంతులసీట్లు సాధించి సరికొత్త రికార్డు నెలకొల్పింది. బెంగాల్‌లో పాగావేయాలన్న బీజేపీ ఎత్తుగడలను విజయవంతంగా వమ్ముచేసింది. తృణమూల్ ఏర్పడి పాతికేళ్లు అయింది. ఇందులో 13 ఏళ్లు అధికారంలో ఉండడం చెప్పుకోదగ్గ విషయమే. 2019 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ 18 సీట్లు సాధించడంచూస్తే తృణమూల్ పట్టు సడలుతున్నట్టు కనిపించింది. అంతకు ముందు బెంగాల్‌నుంచి ఎన్నికైన లోక్‌సభ సభ్యులు 34 మంది ఉంటే 2019లో వారి సంఖ్య 22కు తగ్గడంవల్ల బీజేపీ పుంజుకుంటున్నట్టు కనిపించింది. కానీ 2021 శాసనసభ ఎన్నికలలో మమతాబెనర్జీ బీజేపీని గణనీయంగా దెబ్బ తీయగలిగారు. 2021లో పెద్ద విజయం సాధించిన తరవాత తృణమూల్ అధినేత జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ప్రయత్నిస్తున్నారు. చిన్న చిన్న రాష్ట్రాలలో, ఈశాన్య రాష్ట్రాలలో పోటీచేసినా అంతగా ఫలితం దక్కడంలేదు. జాతీయస్థాయిలో తన పాదముద్రలు అన్వేషించడానికి మమతా బెనర్జీ అందరికన్నా ముందు ప్రతిపక్ష ఐక్యతారాగం ఎత్తుకున్నారు. రాష్ట్రపతి పదవికి ఎన్నికలు జరిగినప్పుడు తమ పార్టీ నాయకుడు, ఇదివరకు బీజేపీ నాయకుడు అయిన యశ్వంత్ సిన్హాను పోటీకి పెట్టారు. అప్పుడు ఆయన ప్రతిపక్ష ఐక్యత గురించి నిరంతరం మాట్లాడారు. రాష్ట్రపతి ఎన్నికలలో ఓటమి తరవాత ఆయన గొంతే వినిపించడం లేదు. 2022 గోవా శాసనసభ ఎన్నికలలో తృణమూల్ ఎంత హడావుడిచేసినా నిష్ప్రయోజనంగానే మిగిలింది. త్రిపురలో బెంగాలీ మాట్లాడేవారు 60శాతం మంది ఉన్నా తృణమూల్‌కు వచ్చిన ఓట్లు నోటా ఓట్లకన్నా తక్కువే. నోటాకు 1.36శాతం ఓట్లు వస్తే తృణమూల్ సాధించింది కేవలం 0.88 శాతమే. మేఘాలయలో కాంగ్రెస్‌ను తృణమూల్ మొత్తంగా కబళించేసినా దక్కింది మాత్రం 14 శాతం ఓట్లే. ఈశాన్య రాష్ట్రాలలో అరకొర పలుకుబడి తప్ప తృణమూల్ కాంగ్రెస్‌కు మరేరాష్ట్రంలోనూ కాలుమోపేచోటు కూడా లేదు. కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆమ్‌ఆద్మీ పార్టీ అయినా తమ పార్టీని ఇతర రాష్ట్రాలలో విస్తరించడానికి, చిన్న పార్టీలతో పొత్తు పెట్టుకోవడానికి ప్రయత్నిస్తోంది. మమతా బెనర్జీ ఆ పనీ చేయడం లేదు. బెంగాల్‌కు ఆవల తృణమూల్‌కు కార్యకర్తలూ లేరు, నాయకులూ లేరు, ఓటర్లు అంతకన్నా లేరు. 2019లో తృణమూల్‌కు ఓటువేసిన వారిలో 99.8శాతం మంది బెంగాల్‌కు చెందిన వారే. కాంగ్రెస్ లేదా ఇతర పార్టీల నుంచి నాయకులను తమ పార్టీలో చేర్చుకోవడంతోనే తృణమూల్ సంతృప్తి పడుతోంది.

మమతా బెనర్జీ బెంగాల్‌లో తన బలాన్నే చూస్తున్నారు తప్ప బలహీనతలను పరిగణిస్తున్నట్టు లేదు. మహిళా నాయకుల్లో చూసినా మమత అగ్రనాయకురాలేమీ కాదు. బెంగాల్‌లో తృణమూల్ సాధించి చూపిన అభివృద్ధి కళ్లు చెదిరేది ఏమీకాదు. కాంగ్రెస్ నుంచి చీలిపోయి ఏర్పడిన పార్టీమాత్రమే కాకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తృణమూల్‌లో చేర్చుకుంటున్నారన్న అపఖ్యాతీ మమతకు ఉంది. మమతా బెనర్జీ ప్రతిపక్ష ఐక్యత గురించి ఎంత గొంతు చించుకున్నా బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కూడా ఆమెను విశ్వసించే స్థితిలోలేరు. బెంగాల్‌లో మొత్తం 42 లోక్‌సభ సీట్లు ఉంటే 40 సాధించగలమనుకోవడం అత్యాశే అవుతుంది. కాంగ్రెస్, వామపక్షాలు కూడా 2024లో ఎంతో కొంత మెరుగుపడొచ్చు. బెంగాలీ ఆత్మగౌరవమో, గొప్పతనమో గట్టెక్కిస్తుందని మమత భావిస్తే అంతకన్నా అవాస్తవం ఏమీ ఉండదు. లోకసభ ఎన్నికలలో ఏ పార్టీకీ మెజారిటీ రాకపోతే 1996లో దేవెగౌడ, ఆ తరవాత ఐ.కె.గుజ్రాల్ ప్రతిపక్షం తరఫున ప్రధాని అభ్యర్థులు అయినట్టు తనకూ అవకాశం ఉందన్న మమత అంచనాలలోనూ బలంలేదు. ఏ దృష్టితో చూసినా జాతీయ రాజకీయాల్లో అక్కడో అంగ ఇక్కడో అంగ వేయడంకన్నా బెంగాల్‌లో ఉన్న పట్టు పదిలపరచుకోవడమే మమతకు లాభదాయకం. ఉత్తరప్రదేశ్‌లో పెద్ద ప్రతిపక్ష పార్టీ సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్, బహుజన సమాజ్ పార్టీ నాయకురాలు మాయావతి కూడా లోకసభ ఎన్నికలలో ఒంటరిగానే పోటీ చేస్తామంటున్నారు. అంటే ముక్కోణ, బహుకోణ పోటీలకు అవకాశం ఇవ్వడమే. రాహుల్ భారత్ జోడో యాత్ర సమాపనోత్సవంలో అఖిలేశ్ పాల్గొనకుండా కాంగ్రెస్‌వ్యతిరేకతను వ్యక్తంచేశారు. ఈ వాతావరణంలో ప్రతిపక్ష ఐక్యతకు ఆయన తోడ్పడతారని అనుకోలేం. 2014 లోకసభ ఎన్నికలలో సమాజ్‌వాదీ పార్టీ సాధించింది అయిదు సీట్లే. 2019లో ఆ పార్టీ మాయావతి పార్టీతో పొత్తు కుదుర్చుకుంది. అయినా దక్కింది ఆ అయిదు సీట్లే. దీనివల్ల బహుజన సమాజ్ పార్టీకే మేలు కలిగి పది సీట్లు దక్కాయి. 2014లో మాయావతి పార్టీకి ఒక్క సీటూరాలేదు. అంటే ఇతరపార్టీలతో పొత్తు మాయావతిపార్టీకి మేలు చేసినా ఈసారి ఆమె ఒంటరిగా పోటీ చేస్తామంటున్నారు. ఇలా అనేక పార్టీలు ఒంటరిగా పోటీకి దిగడం అంటే మోదీని గెలిపించడమే.

ఇలా మిగిలాం...

అయిపోయింది. మళ్లీ ఏడాది వరకూ అటు వైపే చూడాల్సిన అవసరం లేదు. మహిళలను కీర్తిస్తూ... కొలుస్తూ... వారి గొప్పతనాన్ని ఆకాశానికి ఎత్తేస్తూ... సభలు, సమావేశాలు, ట్విట్టర్, వాట్సాప్, ఇన్‌స్టా, ఫేస్ బుక్, టెలీగ్రాం...ఇలా ఎందులో వీలైతే అందులో మహిళలకు వందనాలు చెప్పేశాం. అమ్మగా కన్నందుకు, చనుబాలతో పెంచినందుకు, బాగోగులు చూస్తున్నందుకు, భార్య అయినందుకు, ప్రియురాలుగా ప్రేమించినందుకు, అక్కగా అక్కున చేర్చుకున్నందుకు, చెల్లెలుగా భయమేసినప్పుడు మన చేయి పట్టుకున్నందుకు సకల విధాల, సమస్త రూపాల కృతజ్ఞతలు చెప్పేశాం. మళ్లీ వచ్చే ఏడాది మార్చి 8 వ తేది వరకూ ఏం చేయకపోయినా, చేతులు ముడుచుకుని కూర్చున్నా, మన పనుల్లో మనం మునిగిపోయినా ఎలాంటి ఇబ్బంది లేదు. పితృదేవతలకు నిర్వహించే ఓ క్రతువుకు పెట్టుకునే సెలవు కూడా అవసరం లేదు. మార్చి 8 వ తేది అంటే ప్రభుత్వం ప్రకటించిన అధికారిక సెలవు కదా. సోఫాలో కూర్చుని టీవీల్లో వచ్చే హీరోయిన్ ఓరియంటెండ్ సినిమాని సతీమణి చేసిన పకోడీలో, జంతికలో, చికెన్ లాలీపాప్‌లో తింటూ చూసేయచ్చు. మళ్లీ ఏడాది వరకూ మహిళలకు సంబంధించి ఇక ఎలాంటి కార్యక్రమాలు చేయనవసరం లేదు.

ఓ సీనియర్ దాష్టీకానికి నెల రోజుల క్రితం వేయి స్థంబాల గుడి సాక్షిగా మెడికో ప్రీతి కన్నుమూస్తే అంతర్జాతీయ మహిళాదినోత్సవం నాడు నివాళులర్పించేశాం. ఇది చాలు ఆ చిట్టి తల్లికి. ఆ దుర్మార్గుడు పైకి కనిపించాడు. వాడికి ఏదో ఒక శిక్ష పడుతుంది. ఈ ప్రజాస్వామ్య దేశంలో అది కూడా పడకుండా ఆ దుర్మార్గుడు తప్పించుకున్నా ఆశ్చర్యంపడాల్సింది ఏమీ లేదు. నిజానికి ఇలా జరిగే సమయానికి మన బుర్రలోంచి వాడుచెరిగిపోతాడు. వాడిస్థానంలో మరొకడు రావచ్చు. ఈ వ్యవస్థలో దుర్మార్గుల పేర్లు మారుతున్నాయే తప్ప ఆకృత్యాలకు, పైశాచికత్వానికి అంతు మాత్రం దొరకడం లేదు. దొరకనివ్వడం లేదు. మెడికో ప్రీతి తన ఆత్మహత్యతో వాడి గురించి చెప్పింది కనుక మనకి తెలిసింది కాని... అలా చెప్పలేని,చెప్పుకోలేని

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

మహిళలెంత మంది ఉన్నారో లెక్కించగలమా. పోనీ ఊహించగలమా.

రాయలసీమలోని బోగసముద్రం ఊరు పేరు విన్నారా. మహిళా దినోత్సవానికి ఒకరోజు ముందు ఆ ఊరు తెలుగు వారందరికీ తెలిసింది. మరో కన్నతల్లి మహేశ్వరి తన 14 నెలల కుమారుడు దేవాన్షును చున్నీతో కడుపుకు కట్టుకుని చెరువులో దూకేసింది. భర్త నాగేంద్ర గౌడ్‌కు వరకట్న దాహం ఎక్కువైపోతే ఆ దాహం తీర్చడానికి చెరువులో దూకేసింది ఈ చిట్టితల్లి. ఈ మహేశ్వరి మూడు నెలల గర్భిణి కూడా. ఈ దాహం తీరనిది .... మగవారి పాషాణ హృదయం కరగనిది....వీడు కూడా బెయిలో, మరో మధ్యవర్తిత్వంతోనూ బయటకు వచ్చేస్తాడు. తన దాహం తీర్చని మహేశ్వరి స్థానంలో మరొకరిని వివాహం చేసుకుంటాడు. ఈ కేసు కూడా పాత వరకట్నకేసుల్లాగే మసి పూసి మహేశ్వరిగా మారిపోతుంది. మహిళా దినోత్సవం రోజే దేశ రాజధాని ఢిల్లీలో పవన్‌సింగ్ అనే నీచుడు భార్యను ఆరు ముక్కలుగా కోసి నీళ్లులేని వాటర్ ట్యాంక్‌లో పడేశాడు. ఇంతకీ ఆ ఇల్లాలు చేసిన పాపం మంచిగా బతకమని, దొంగనోట్లు ముద్రించవద్దని. ఇలాంటి వారిని పట్టుకుని ఆరు కాదు... అరవై ముక్కలు చేయాలనిపిస్తుంది కదా. చేయలేం. ప్రజాస్వామ్యం చేయనివ్వదు. వీడు బయటకు వచ్చేస్తాడు. ఇలా ఎంతమంది రాలేదు కనుక వీడు రాకపోవడానికి.

తెలుగు, తమిళ, మళయాళ, హిందీ భాషల్లో ఓ వెలుగు వెలిగిన నటి చేసిన ప్రకటన ఈ దేశంలో ఏ స్త్రీ ఈ దారుణాలకు మినహాయింపు కాదని లోకానికి మరోసారి తెలిసింది. తన ఎనిమిదో ఏటే తండ్రి నుంచి లైంగిన వేధింపులు ఎదుర్కొంది ఆ నటి. యాధృచ్ఛికమే అయినా ఆమె కూడా మహిళాదినోత్సవానికి ముందు రోజే ప్రకటించింది తనపై తన తండ్రి చేసిన ఆకృత్యాలను. ఇలాంటి దేశంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవాలను జరుపుకోవాల్సిందే. వచ్చే ఏడాదే కాదు... ఆ తర్వాత... ఆ తర్వాత... ఆ తర్వాత కూడా జరుపుకోవాల్సిందే. మనుషుల్లా బతకడం ఎలాగో మరచిపోయిన మన గురించే మహాకవి శ్రీశ్రీ ఇలా అన్నాడు....

"మనదీ ఒక బతుకేనా... కుక్కల వలె, నక్కల వలె, సందుల్లో పందుల వలె.." అన్నట్లు దీనికి నేనూ మినహాయింపు కాదు. మీరు కూడా కాదు.

సీనియర్ జర్నలిస్టు, 9912019929

మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలి

డి.రాజా, సీపీఐ ప్రధాన కార్యదర్శి

ప్రపంచమంతటా మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పితృస్వామ్య వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న మహిళలందరికీ సీపీఐ సంఘీభావం తెలియజేస్తోంది. స్త్రీ, పురుష సమానత్వాన్ని అమలు జరపాలని పార్టీ గట్టిగా కోరుతోంది. 1917లోనే సోవియట్ రష్యాలో మహిళలు బాధలనుండి విముక్తి పొందిన తరువాత అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆ రోజు రష్యా విప్లవానికి నాయకత్వం వహించిన వ్లదిమీర్ లెనిన్ నిర్ద్వంద్వంగా ఇలా చెప్పారు. "పెట్టుబడీదారీ వ్యవస్థలో మానవజాతిలో సగం ఉన్న మహిళలు రెట్టింపు హింసకు గురవుతున్నారు." రెట్టింపు హింసకు గురవుతున్న మహిళలకు అండగా మనం పోరాటం చేస్తున్నాం. ప్లేగు లాంటి పితృస్వామిక వ్యవస్థలో హింస నుండి విముక్తికోసం పోరాడి ప్రాణాలు అర్పించడంద్వారా ఎనలేని త్యాగాలుచేసిన మన మహిళా కామ్రేడ్స్‌ను మహిళా దినోత్సవం సందర్భంగా గుర్తు చేసుకుందాం. ఈ వ్యవస్థలో విద్య, వనరుల అందుబాటులోలేని సమాన అవకాశాలు, ఆరోగ్య భద్రతలేని మహిళల సేవలను గుర్తించకపోవడం లాంటి సమస్యలు ఇంకా మిగిలేఉన్నాయి. దేశంలో మహిళల విముక్తి, సమానత్వం, తదితర అంశాలను వ్యతిరేకిస్తున్న శక్తులు అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. మహిళలను కేవలం కుల వ్యవస్థకు ప్రతీకలుగా కుదించిన శక్తులు పరిపాలన చేస్తున్నాయి. విలువలకు, స్త్రీ,పురుష సమానత్వంకోసం, స్వేచ్ఛ కోసం డిమాండ్ చేస్తున్న మహిళా ఉద్యమాలను ఈ శక్తులు వ్యతిరేకిస్తున్నాయి.

కొంతకాలం క్రితం సీటెల్ నగరంలో కులవివక్షను నిషేధించాలని కోరుతూ జనం ఓట్లు వేశారు. అన్ని విభాగాలలోనూ మహిళల సంఖ్యను పెంచేందుకు ముసాయిదా బిల్లును స్పెయిన్ ప్రభుత్వం ఆమోదించింది.

దీని ద్వారా రాజకీయాలలో, వ్యాపారాలు, వృత్తి సంఘాలు తదితరాలలో మహిళలకు సీట్ల కోటాలను నిర్ణయిస్తారు. ప్రపంచమంతటా అన్ని ప్రభుత్వాలు మహిళలకు సమానత్వం, సామాజిక న్యాయం లభించేవిధంగా ప్రగతిశీల చట్టాలను చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. మనదేశంలోనూ లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో 33శాతం మహిళలకు రిజర్వేషన్ కావాలన్న బిల్లును బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ పాలనలో ఇంకా తొక్కిపెట్టే ఉంచారు. చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్ కల్పించే బిల్లును ఆమోదించాలని మహిళా ఉద్యమంలో గొప్ప నాయకురాలు కామ్రేడ్ గీతా ముఖర్జీ తన జీవితమంతా పోరాడారు. ఆమె శతజయంతిని ఈ సంవత్సరం మనం నిర్వహించుకున్నాము. మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని పోరాడటం ద్వారా గీతా ముఖర్జీ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు పోరాడాలి. పోరాటం ద్వారా గీతా ముఖర్జీని నిజంగా గౌరవించాలి. మహిళా రిజర్వేషన్ చట్టంకోసం ఇంకా పోరాడవలసి ఉంది. దేశనిర్మాణంలో మహిళలు చేస్తున్న కఠినమైన శ్రమను గుర్తించి చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచాలి. అటవీ ఉత్పత్తులను సేకరించే గిరిజన మహిళలు కావచ్చు.. సాంకేతిక కంపెనీలలో పనిచేస్తున్న యువతులు కావచ్చు వీరికి అన్నివిధాలుగా ప్రోత్సాహాన్ని అందించాలి.

రాజ్యాంగ రూపకర్త డా.బిఆర్ అంబేద్కర్ ఇలా చెప్పారు "పురోగమనమైన మహిళా సమాజానికి చర్యలు తీసుకోవడం ద్వారా కొంతమేరకైనా మహిళలు విజయం సాధించగలిగారు". అంబేద్కర్ చెప్పినట్లుగా స్త్రీ,పురుషుల మధ్య సమానత్వం సాధించడానికి పురుషుల ఆధిపత్యాన్ని అంతమొందించడానికి పోరాటం సాగించాలి. మహిళా దినోత్సవం రోజు సమానత్వం, సామరస్యం కోసం పోరాడుతున్న సహచరులందరికీ వందనాలు అర్పిద్దాం. మహిళా ఉద్యమం సాధించిన విజయాలను, పురోగతిని వెనక్కు మళ్లించేందుకు ప్రయత్నిస్తున్న శక్తులను ఓడించాలని పార్టీ పిలుపునిస్తోంది.

గర్భస్థ శిశువుకి విలువలు నేర్పడం అశాస్త్రీయం

ఓ-మెయిల్

హిరణ్యాక్షుని కొడుకు ప్రహ్లాదుడు తల్లి లీలావతి గర్భంలో ఉండగానే కొడుకుని తండ్రి భావాలకు వ్యతిరేకంగా హరిభక్తునిగా తయారు చెయ్యాలన్న ఆలోచనతో నారదుడు లీలావతి పొట్టలోఉన్న శిశువుకి హరిభక్తి నూరిపోసినట్లుగా చెప్తారు. ఇప్పుడుకూడా గర్భంలోఉన్న శిశువులకు సంస్కృతి, విలువలగురించి నూరిపొయ్యాలన్న ఆలోచన కొన్ని మత సంస్థలకు రావటం అనేది మనలను వెనక్కి తీసుకపోవటమే అవుతుంది. అవన్నీ పుక్కిటి పురాణాలు. రుజువులులేవు. మనలను ఆటవికానికి, పాతకాలంలోకి తీసుకెళ్ళటానికి ఒక పెద్ద కుట్ర జరుగుతుంది. మనం ఏకాలంలో ఉన్నాం? గర్భంలో ఉన్న శిశువుకి



బయటచెప్పే మాటలు అర్థం చేసుకునే శక్తి ఉంటుందా? ఈ రోజుకొన్ని మతసంస్థలు ముందుకొచ్చి సమాజాన్ని వేదకాలంలోకి తీసుకెళ్లాలని అంటున్నాయి. అందులో భాగంగానే ఆవుని కౌగిలించుకోవాలి అంటూ కౌ హగ్ డే లు, ఆవు మూత్రంలో బంగారాన్ని చూడటము, ఆవు మూత్రంలో రోగనిరోధక శక్తి ఉందని ప్రచారం చెయ్యటం, ఇవన్నీ అందులో భాగమే! యోగాలో రోగనిరోధక శక్తిఉంటే, యోగా గురువు రామ్‌దేవ్ బాబాకి జబ్బుచేస్తే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ఎందుకు వెళ్ళాడు? పిరమిడాకారంలో ఉన్న ఇళ్లలో కాపురముంటే రోగాలు రావని ప్రచారంచేసే పిరమిడ్ ధ్యాన కేంద్ర స్థాపకుడు పత్రీజీ కిడ్నీ రోగంతో ఎందుకు చనిపోయాడు? ఆయనతోపాటు తిరుపతిలో పనిచేసిన అయన మిత్రులు కూడా కిడ్నీ జబ్బుతోనే చనిపోయారు. యోగ ప్రచారం చేసిన శంకరాచార్యుడు 32 ఏళ్లకే ఎందుకు చనిపోయాడు? వివేకానందుడు 37 సంవత్సరాలకే ఎందుకు చనిపోయాడు? పొట్టలో ఉన్న శిశువుకి బయట చెప్పే సోది వినిపించి మంచి సంస్కృతి, మంచి జీవితం, మంచి విలువలు నేర్పటం అనేది అబద్ధం. ప్రహ్లాదుని విషయంలో ఆరోజుల్లో శైవులకి, వైష్ణవులకు జరిగిన ఆధిపత్య పోరాటంలో కల్పించిన కట్టుకథలు మాత్రమే ! వాటిని నిజమని నమ్మేవారు ఉన్నంతకాలం వీరి ఆటలు సాగుతాయి.

నార్నె వెంకటసుబ్బయ్య

అంతులేని సంపద అంతుచిక్కని రహస్యం

చలసాని వెంకట రామారావు



తిరువాన్కూరు రాజవంశీకులు నిర్మించిన పద్మనాభస్వామి దేవాలయపు నేలమాళిగల్లో లక్షల కోట్ల విలువచేసే సంపద నిక్షిప్తమైంది. ఇందులో కొంత లెక్కించగా లక్షలకోట్ల విలువైన వజ్రవైఢూర్యాలున్నాయనేది ఒకనాటి ఫ్యూడల్ వ్యవస్థలోని సంపద కథ. కానీ ఆధునిక భారతంలో కొద్ది సంవత్సరాలలోనే అంతులేని సంపదను అక్రమంగా కూడబెట్టిన అంతుచిక్కని రహస్యాన్ని 'హిండెన్‌బర్గ్ రీసెర్చ్' అమెరికా ఆధారిత పెట్టుబడి పరిశోధనా సంస్థ 2023 జనవరి 24న ఒక నివేదికను ప్రపంచం ముందు ఉంచింది. ఆశ్రిత పెట్టుబడీదారీ వర్గం సృష్టించిన అపరకుబేరుడు అదాని ఆర్థిక సామ్రాజ్య నిర్మాణంపై వెల్లడించిన నివేదిక ఇది.

హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ షార్టు సెల్లింగ్ షేర్‌లను అంచనావేసి తక్కువరేటు ఉన్నప్పుడు కొనుగోలుచేసి, ఎక్కువ ధరకు తిరిగి అమ్ముతూ లాభాలను గడించే సంస్థ. ఆర్థిక సంస్థల మోసాలను బైటపెట్టి పెద్దపెద్ద కంపెనీలను దివాళా తీయించిన చరిత్ర హిండెన్‌బర్గ్ సంస్థకు ఉంది. ఈ సంస్థ రెండు సంవత్సరాలపాటు పరిశోధనచేసి ప్రపంచ కుబేరులలో 3వ స్థానంలో ఉన్న అదాని ఆర్థిక మోసాలపై ఒక నివేదికను ప్రకటించింది. ఈ నివేదిక వెలువడగానే అదాని ఆర్థిక సామ్రాజ్యం కకావికలమైంది. అదాని కంపెనీల షేర్లు ఒక్కసారిగా కుప్పకూలి మదుపర్ల లక్షల కోట్ల ధనం ఆవిరైపోయింది. అదాని కంపెనీల డొల్లతనం బైటపడింది. అదాని కంపెనీల షేర్లు పెంచుకోవటానికి అనుసరించిన అక్రమ, అవినీతి పద్ధతులను ఈ నివేదిక వెల్లడిచేసింది. అదాని వివాదాలపుట్ట బద్దలై వీరి ఆర్థిక సామ్రాజ్యం ఒక పేకమేడలా కుప్పకూలటం ప్రారంభమైంది. అదాని ఎంటర్‌ప్రైజెస్ ద్వారా 2.5 బిలియన్ల డాలర్ల ఫాలో ఆఫ్ పబ్లిక్ ఆఫర్‌ను జారీ చేయడానికి రెండు రోజుల ముందు ఈ నివేదిక రావటం విశేషం.

అదాని ఆర్థిక సామ్రాజ్యం ఒక అప్పులకుప్ప. స్టాక్ మార్కెట్‌లో మలేషియాలో తాము నెలకొల్పిన డొల్ల కంపెనీల ద్వారా తమ షేర్లను తామే ఎక్కువరేటుకు కొనుగోలుచేసి మార్కెట్‌లో కృత్రిమంగా డిమాండ్ సృష్టించారు. దీనితో అదాని కంపెనీల షేర్లకు మార్కెట్‌లో డిమాండ్ పెరిగి ఎక్కువ రేటుకు అమ్మకాలు చేశారు. ఈ రకంగా మదుపర్లను మోసం చేశారు. వాస్తవానికి అదాని కంపెనీలోని షేర్లలో 65 నుండి 73శాతం వరకు ప్రమోటర్లుగా ఉన్న అదాని కుటుంబసభ్యుల పేరుతో ఉన్నాయి. దీనితో ఎక్కువరేటు కొనుగోలు చేసిన ప్రయోజనాలు అన్నీ అదానీ కుటుంబానికే దక్కాయి. బయట ఓపెన్ మార్కెట్‌లో 10శాతం షేర్లు మాత్రమే ఉంచి సరఫరా తక్కువచేసి డిమాండ్ పెంచి తమ వద్ద ఉన్న 90శాతం షేర్లను ఎక్కువధరకు అమ్మడం ద్వారా తమ సంపదను పెంచుకున్నారు. లక్ష పెట్టుబడి పెడితే కృత్రిమ బూమ్ వలన దాని విలువ 20లక్షలకు పెరిగింది. దీనికితోడు రాజకీయ తోడ్పాటుకూడా అదాని ఆర్థికసామ్రాజ్య విస్తరణలో ప్రముఖపాత్ర వహించింది. మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత అదాని అర్థికసామ్రాజ్యం ఒక తారాజువ్వలా ఎగిసింది. భారీ కంపెనీలుగా విస్తరించాయి. అదాని గ్యాస్, అదాని ఎంటర్‌ప్రైజెస్, అదాని గ్రీన్, అదాని ట్రాన్స్‌మిషన్, అదాని పోర్ట్సు, అదాని పవర్ వంటి అనేక సంస్థలను స్థాపించి అపరకుబేరుడిగా ఎదిగాడు. అదాని బ్యాంకులు, బాండ్ల ద్వారా భారీగా అప్పులు చేశాడు. అదానీకి 2లక్షల కోట్లు అప్పులు ఉన్నాయి. ప్రభుత్వరంగ సంస్థలు భారీగా అదాని కంపెనీలలో పెట్టుబడులు పెట్టాయి. ప్రభుత్వరంగ బ్యాంకులు 81వేల కోట్లు, జీవిత బీమా సంస్థ 77వేల కోట్లు పెట్టుబడులుగా పెట్టాయి. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్లోబలైజేషన్ ప్రక్రియ వేగవంతమై ప్రైవేటు పెట్టుబడిదారులకు ప్రోత్సాహం పెరిగింది. అనేక ప్రభుత్వరంగ సంస్థలకు ప్రైవేటు పెట్టుబడిదార్ల పరం చేశారు. అంబాని, అదాని వంటి గుజరాత్ వ్యాపారులు మోదీ పాలనలో ఎన్నో ప్రయోజనాలు పొందారు. స్టాక్ మార్కెట్లను ప్రలోభపెట్టి అదానీ షేర్లను అనూహ్యంగా పెంచుకుంటూ వచ్చాడు. కరోనా కాలంలో సైతం దేశం సంక్షోభంలో ఉండి, పారిశ్రామిక ఉత్పత్తి పడిపోయింది. ప్రపంచమంతా తీవ్ర ఒడిదుడుకులకులోనైనా అదానీ మాత్రం రోజుకు 1660 కోట్ల ఆదాయం పొందారు.

మోదీ ప్రభుత్వ సహకారం వల్ల ఎకౌంటింగ్ మోసాలకు అదాని పాల్పడ్డారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులకు ఎగనామం పెట్టారు. ప్రభుత్వరంగ సంస్థలలోని ప్రజలసొమ్ముతో వ్యాపారం చేశారు. మోదీ కరుణా కటాక్షాలతో పోర్టులు, విమానాశ్రయాలు, అదానీ చేతిలోకి వచ్చాయి. ఇంజనీరింగ్ కంపెనీలు, రైలు, రైల్వే స్టేషన్‌లు, ఫార్మా కంపెనీలు, ఇన్సూరెన్స్ కంపెనీలు, రోడ్లు, నదులు, సముద్రాలు, భూగర్భ గనులు, పైప్ లైన్లు, కేబుళ్లు కారు చౌకగా అమ్మివేశారు. అదాని ప్రపంచ మూడవ ధనవంతునిగా కావటానికి అన్ని హంగులు మోదీ ప్రభుత్వం చేసింది. 2015 బంగ్లాదేశ్ విద్యుత్ ఒప్పందంలో ఆస్ట్రేలియా బొగ్గుగనుల కాంట్రాక్టులో, శ్రీలంక విద్యుత్ ప్రాజెక్టు ఒప్పందంలో, ఆరు కీలక విమానాశ్రయాల అప్పగింతలో, విదేశీ బొగ్గు కొనుగోలు ఉత్తర్వులు జారీలో, జీవితబీమా, ప్రభుత్వ రంగ బ్యాంకుల అప్పులలో కేంద్ర ప్రభుత్వ పాత్ర జగద్విదితమే. మోదీతో ఉన్న రాజకీయ సాన్నిహిత్యం వల్లే ఇది సాధ్యమైంది. ముంబయిలోని జీవికె ఎయిర్‌పోర్టు, నవీముంబయి ఎయిర్‌పోర్టు వ్యవహారంలో కేంద్రం తీరు తీవ్ర విమర్శలకు గురైంది.

అహ్మదాబాద్, లక్నో, జైపూర్, గౌహతి, బెంగుళూరు, తిరువనంతపురం విమానాశ్రయాలతోపాటు 13 పోర్టులు అదాని పరం అయ్యాయి. మన రాష్ట్రానికి చెందిన గంగవరం, కృష్ణపట్నం పోర్టులు కూడా వీటిలో ఉన్నాయి. అంబుజా సిమెంట్‌లో 35కోట్ల విలువైన 63శాతం వాటా అదాని పరమైంది. విద్యుత్‌రంగం, సోలార్ విద్యుత్, రియల్‌ఎస్టేట్, బాస్మతిరైస్, వంటనూనెల రంగాలలో అదానీకి ఎదురులేని పరిస్థితి ఏర్పడింది. దేశంలో అతి పెద్ద బొగ్గు సరఫరా సంస్థ, అతిపెద్ద సోలార్ విద్యుత్, పెద్ద గ్యాస్ డిస్ట్రిబ్యూషన్, పెద్ద థర్మల్ విద్యుత్‌సంస్థ అదాని చేతిలోనే ఉన్నాయి. 30కిపైగా కంపెనీలతో 2014 తరువాత అదానీ సామ్రాజ్యం విస్తరించింది. 8ఏళ్లలో ప్రపంచ ధనవంతులలో ఒకడిగా నిలిచాడు.

ఇంతటి పెద్ద ఆర్థిక కుంభకోణం బైటపడినప్పటికీ అదానీ ఆశ్రిత బంధువు, దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీగాని, దేశ విత్తమంత్రి నిర్మలా సీతారామన్‌గాని ఈ విషయంలో స్పందించకుండా మౌనం దాల్చారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలలో జాయింట్ పార్లమెంటరీ కమిటీ డిమాండ్‌తో విపక్షాలు ఆందోళన చేసినా ప్రభుత్వం స్పందించలేదు. చివరకు సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదికలో అదానీ గ్రూపు కంపెనీల షేర్లు పతనానికి దారితీసిన పరిస్థితులు, స్టాక్‌మార్కెట్ రెగ్యులేటరీ అంశాలపై దర్యాప్తు చేసేందుకు సుప్రీంకోర్టు ఓ నిపుణుల కమిటీని నియమించింది. మదుపర్ల రక్షణకు సైతం సిఫారసులు చేయాలని కోరింది. కమిటీ దర్యాప్తు అంశాలను ప్రజలకు వెల్లడించి దోషులను శిక్షించాలి.

వ్యాస రచయిత సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు

ఎస్‌హెచ్‌జీలో యూనికార్న్‌లకు కృషి

మహిళా సాధికారతతో సమాజంలో విప్లవాత్మక మార్పు: పోస్ట్‌బడ్జెట్ వెబినార్‌లో మోదీ

న్యూదిల్లీ: మహిళల స్వీయ సహాయక సంఘాలలో యూనికార్న్‌ల కోసం కృషి చేస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. తమ తొమ్మిదేళ్ల పాలనలో మహిళల అభివృద్ధి నుంచి మహిళల నేతృత్వంలో అభివృద్ధి జరిగే స్థాయికి దేశం ఎదిగిందని చెప్పారు. మహిళా సాధికారతకు తీసుకుంటున్న చర్యల ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. సామాజిక జీవనంలో విప్లవాత్మక మార్పు వస్తోందని మోదీ నొక్కిచెప్పారు. మహిళలను గౌరవించడం, సమానత్వ భావన స్థాయి పెంచడంతోనే భారత్ ముందుకెళ్లగలదని చెప్పారు. మహిళా ఎంట్రప్రెన్యూర్లు పెరుగుతున్నారని, దేశ సైన్యంలో మహిళలు కీలక పదవులు చేపడుతున్నారని, రఫేల్ విమానాలు నడుపుతున్నారని, రాజకీయాల్లోనూ రాణిస్తున్నారన్నారు. నాగాలాండ్‌లో తొలిసారి ఇద్దరు మహిళలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారని, వారిలో ఒకరు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారని మోదీ అన్నారు.

మహిళా సాధికారతపై పోస్ట్ బడ్జెట్ వెబినార్‌లో మోదీ మాట్లాడుతూ ఇంజినీరింగ్, సైన్స్, టెక్నాలజీ, మ్యాథ్స్‌లో మహిళలు రాణిస్తున్నారని, ఆయా రంగాల్లో జరిగే ప్రవేశాలలో 43శాతం మహిళలవేనన్నారు. స్వీయ సహాయక సంఘాల్లోనూ యూనికార్న్‌లను సృష్టించగలమా! ఓ విజన్‌తో బడ్జెట్ తెచ్చామని మోదీ చెప్పారు. యూనికార్న్‌లు అంటే స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ లేకుండా ఉండే బిలియన్ డాలర్ల విలువ చేసే కంపెనీలు. ఎస్‌హెచ్‌జీలో ఏడు కోట్ల మందికిపైగా మహిళలు సభ్యులుగా ఉన్నారని, ఈ సంఘాల రూ.6.25లక్షల కోట్ల రుణంతో వారి పెట్టుబడి అవసరాన్ని అంచనా వేయొచ్చన్నారు. బ్యాంక్ సఖి, క్రిషి సఖి, పాషసఖి వంటి కార్యక్రమాలను చేపట్టినట్లు వెల్లడించారు. ఐదింటిలో ఒక వ్యవసాయేతర వ్యాపారాన్ని నడిపేది మహిళలేనన్నారు. రెండు లక్షలకుపైగా బహుళ ప్రయోజనాల కోఆపరేటివ్‌లు, డెయిరీ కోఆపరేటివ్‌లు, మత్స్య కోఆపరేటివ్‌లు సమీప భవిష్యత్‌లో ఏర్పాటు కానున్నట్లు మోదీ తెలిపారు. శ్రీఅన్నలో సంప్రదాయ అనుభవంగల కోటి మందికిపైగా గిరిజన మహిళలు భాగస్వాములు కావచ్చన్నారు. నైపుణ్యాభివృద్ధి, విశ్వకర్మ పథకం వంటివి మహిళా సాధికారతకు దోహదమవుతున్నట్లు తెలిపారు. జీఈఎం, ఈ-కామర్స్ వంటివి మహిళల వాణిజ్య అవకాశాలను విస్తరింపజేస్తున్నాయన్నారు.

ముద్రా రుణాల లబ్ధిదారుల్లో 70శాతం మహిళలేనని, ఈ ఏడాది బడ్జెట్ 'వికసిత్ భారత్ -2047' లక్ష్యంతో రూపొందినట్లు తెలిపారు. 'నారీ శక్తి', 'మాతృశక్తి'ని ప్రస్తావించారు. దృఢ సంకల్పంతో, లక్షాలను చేరుకునే పట్టుదలతో, తీవ్రంగా శ్రమించడం వంటి గుణాలు మహిళల్లో ఉన్నాయని, అవి ఈ శతాబ్దంలో దేశ గతిశక్తిని పెంచడంలో ఎంతగానో దోహదమవుతున్నాయని అన్నారు. పురుషులతో పోల్చితే మహిళల సంఖ్య పెరుగుతోందని, గత తొమ్మిది పదేళ్లలో కంటే హైస్కూల్లో చదివే బాలికల సంఖ్య మూడు రెట్లు పెరిగిందని చెప్పారు. వైద్య, వాణిజ్యం, రాజకీయ రంగాల్లోనే కాకుండా క్రీడల్లోనూ మహిళలు రాణిస్తున్నారన్నారు. తమ ప్రభుత్వం మహిళల కోసం తెచ్చే పథకాలను ప్రస్తావించారు.

'పురోగతిని వేగవంతం చేసే బాధ్యత మనందరిపై ఉంది. ఇందుకు ప్రతి ఒక్కరు పునరంకితం కావాలి. అందుకోసం ముందుకు మీ కుటుంబం, పరిసరాలు, పని ప్రదేశాల్లో ఏదో ఒక మార్పు తీసుకు రండి. ఒక అమ్మాయి ముఖంలో చిరునవ్వు చిగురింపజేసే విధంగా మార్పు తీసుకురండి. ఆమె తన జీవితంలో మెరుగైన విధంగా ముందుకు సాగేందుకు మార్పు తీసుకురండి. ఇది నా హృదయపూర్వక విన్నపం..' అంటూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ రాసిన వ్యాసంలోని వాక్యాలతో తన ప్రసంగాన్ని మోదీ ముగించారు.

తేజస్వీ నివాసంలో ఈడీ సోదాలు

న్యూదిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచుతోంది. ఇప్పటికే కేసులు, కుంభకోణా పేరుతో అనేక మంది ప్రతిపక్షనేతల ఇళ్లలో సోదాలు, విచారణలో చేపడుతున్న ఈడీ తాజాగా బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ నివాసంలో సోదాలు చేపట్టింది. ల్యాండ్ ఫర్ జాబ్స్ స్కామ్‌లో ఈడీ తనిఖీలు జరుపుతోంది. దేశ రాజధానిలోని న్యూ ఫ్రెండ్స్ కాలనీలో ఉన్న ఆర్జేడీ నాయకుడి నివాసంతో పాటు ముంబై, యూపీ, బీహార్‌లోని 15 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఆయా కేసులకు సంబంధించి సాక్ష్యాల సేకరణ కోసం మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఈడీ రంగంలోకి దిగిందని సమాచారం. ఈ కేసుకు సంబంధించి ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లోని సమాజ్‌వాదీ పార్టీ నేత జితేంద్ర యాదవ్ నివాసానికి కూడా ఈడీ అధికారులు చేరుకున్నారు. జితేంద్ర యాదవ్ లాలూ ప్రసాద్ యాదవ్ కూతురు రాగిణి భర్త. బీహార్‌లోని పాట్నాలో ఆర్జేడీ నేత, లాలూ ప్రసాద్ యాదవ్ సహాయకుడు అబు దోజానా ఇంట్లో కూడా దాడులు కొనసాగుతున్నాయి. కాగా కొన్ని రోజుల క్రితమే ఈ కేసుతో సంబంధం ఉన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న బీహార్ మాజీ సీఎం రబ్రీదేవి నివాసంలో సీబీఐ దర్యాప్తు చేపట్టిన విషయం తెలిసిందే.

జేఎన్‌యూ సాంస్కృతిక ఐక్యతకు నిలయం: ముర్ము

న్యూదిల్లీ: దేశంలోని సాంస్కృతిక ఐక్యతకు సజీవ ప్రతిబింబంలా జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) ఉన్నదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. శుక్రవారం వర్సిటీ ఆరవ స్నాతకోత్సవంలో ఆమె మాట్లాడుతూ యూనివర్సిటీలో పురుషుల కంటే మహిళా రీసెర్చ్ స్కాలర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం సామాజిక మార్పునకు సంకేతమన్నారు. 'జేఎన్‌యూ యువ వర్సిటీ. ఇది అర్థవంతమైన, చరిత్రాత్మక ప్రాముఖ్యత కలిగిన వ్యవస్థ. మహాత్మాగాంధీ శతజయంత్యుత్సవంలో జేఎన్‌యూ ప్రారంభమైంది. అందమైన అరావళ్లి గిరుల్లో ఇది నెలకొని ఉంది. దేశ నలుమూలల నుంచి విద్యార్థులు ఈ యూనివర్సిటీలో చదువుతున్నారు. క్యాంపస్‌లో కలిసి ఉంటారు. తద్వార వారిలో భారత్, ప్రపంచ పరిజ్ఞానం ఎరుగుతుంది. వైవిధ్య భారతంలో సాంస్కృతిక ఐక్యతకు సజీవ ప్రతిబింబంలా జేఎన్‌యూ ఉంది' అని ముర్ము అన్నారు. స్నాతకోత్సవానికి కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్, భారత ప్రభుత్వానికి ప్రధాన శాస్త్రీయ సలహాదారు ఏకే సూద్, జేఎన్‌యూ ఛాన్సలర్ విజయ్ కుమార్ సరస్వత్ హాజరయ్యారు. ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ జేఎన్‌యూ... బహుళ-వైవిధ్య వ్యవస్థ. ఇక్కడ జరిగే చర్చలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది అని అన్నారు. 'ఇది రీసెర్చ్ యూనివర్సిటీ. బహుళ-వైవిధ్యతకు నిలయం. దేశాన్ని ముందుకు తీసుకెళుతోంది' అని చెప్పారు. జేఎన్‌యూ వీసీ శాంతిశ్రీ ధూలిపూడి పండిట్ మాట్లాడుతూ 'ఇది ఆరవ స్నాతకోత్సవం. మొత్తం 948 మంది రీసెర్చ్ స్కాలర్లకు డిగ్రీ పట్టాలిచ్చాం. పురుషుల కంటే మహిళా రీసెర్చ్ స్కాలర్లు ఎక్కువగా ఉన్నారు. 52శాతం మంది ఎస్సీ, ఎస్టీలు, ఓబీసీ విద్యార్థులున్నారు. క్రీడల్లోనూ రాణిస్తున్నాం' అని అన్నారు.

ప్యాసింజర్ రైలు నడిపిన మహిళా సిబ్బంది

రాంచీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాంచీ-టోరీ ప్యాసింజర్ రైలును మొత్తం మహిళా సిబ్బంది నడిపారు. రాంచీ రైల్వే డివిజన్ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ... ఈ సందర్భాన్ని మహిళలకు అంకితం చేశాం... ఒక మహిళా అధికారి రైలును పచ్చ జెండా ఊపి ప్రారంభించగా దానిని మహిళా సిబ్బంది అందరూ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ ప్యాసింజర్ రైలును ఉదయం 8.55 గంటలకు రాంచీ రైల్వే స్టేషన్ నుంచి సీనియర్ డివిజనల్ ఆపరేషన్ మేనేజర్ (ప్లానింగ్) శ్రేయా సింగ్ ప్రారంభించారు. అనంతం ఆమె మాట్లాడుతూ... 'మహిళలు ఒక రోజు చేసిన ఈ ఆపరేషన్ ఒక ఉదాహరణ మాత్రమే. మొత్తం రైలు కార్యకలాపాలను మహిళలు నిర్వహించగలరు. మహిళలు దేశాన్ని ముందుండి నడిపించగలరు' అని అన్నారు. రైలు నడిపిన మహిళా సిబ్బందిలో లోకో-పైలట్, అసిస్టెంట్ లోకో-పైలట్, రైలు మేనేజర్, ఐదుగురు టికెట్ కలెక్టర్లు, ఆరుగురు రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) సభ్యులు ఉన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై మీ వైఖరేంటి?

బీజేపీని ప్రశ్నించిన కాంగ్రెస్

పార్లమెంటు వచ్చే సమావేశాల్లో ప్రవేశపెట్టాలని డిమాండ్

న్యూదిల్లీ : మహిళా రిజర్వేషన్ బిల్లుపై తమ వైఖరిని స్పష్టం చేయాలని కాంగ్రెస్ శుక్రవారం బీజేపీని కోరింది. బిల్లును పార్లమెంటు బడ్జెట్ సమావేశాల రెండవ భాగంలో లోక్‌సభలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేసింది. మార్చి 13 నుంచి ప్రారంభమయ్యే ఈ సమావేశాల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లును ఆమోదించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకురాలు కె.కవిత నిరాహార దీక్ష చేస్తున్న రోజున కాంగ్రెస్ ఈ ప్రకటన చేసింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఒక ట్వీట్‌లో, 'కాంగ్రెస్ నాయకత్వం కృషి కారణంగానే 2010 మార్చి 9న చారిత్రక మహిళా రిజర్వేషన్ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది' అని అన్నారు. 'కానీ లోక్‌సభలో దానికి మద్దతు లభించలేదు. బిల్లు ముగియలేదు. అది సజీవంగా ఉంది. పెండింగ్‌లో ఉంది. దానిని పునరుద్ధరించకుండా ఆపింది ఏమిటి?' అని ఆయన అన్నారు. ఇక్కడ విలేకరుల సమావేశంలో బిల్లు గురించి అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ నాయకురాలు అల్కా లాంబా మాట్లాడుతూ రాజ్యసభలో బిల్లు ఆమోదించబడినప్పుడు, లోక్‌సభలో కాంగ్రెస్‌కు మెజారిటీ లేదని, అది సంకీర్ణ ప్రభుత్వమని అన్నారు. 'మహిళా రిజర్వేషన్ బిల్లును రాజ్యసభలో ఆమోదించడంలో మేము విజయం సాధించాము. ఇది సజీవంగా ఉంది. లోక్‌సభలో బీజేపీ ప్రభుత్వానికి మెజారిటీ ఉంది. వారు తమ 2019 మేనిఫెస్టోలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు కూడా, కానీ ప్రభుత్వంలో తొమ్మిదేళ్లు గడిచినా ఇంకా మౌనంగానే ఉన్నారు' అని ఆమె అన్నారు. 'పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతున్నాయని, బీజేపీ ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని, మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టాలని, మహిళల హక్కులకు హామీ ఇవ్వాలని మేము కోరుతున్నాము' అని ఆయన తెలిపారు. కాగా రెండో విడత బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 6తో ముగియనున్నాయి.

ఒత్తిళ్లే కారణమా...!

జూదం బిల్లు వెనక్కి పంపిన తమిళనాడు గవర్నర్ తీరుపై స్పీకర్

చెన్నై: ఆన్‌లైన్ జూదాన్ని (రమ్మీ) నిషేధించే బిల్లును వెనక్కి పంపడంలో గవర్నర్ ఆర్ఎన్ రవి విజ్ఞత అర్థం కాలేదని తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ ఎం.అప్పవు వ్యాఖ్యానించారు. ఏవో ఒత్తిళ్లకు తలొగ్గే ఆయన ఇలా చేసివుంటారన్న సందేహం కలుగుతోందన్నారు. ఈ బిల్లుకు సంబంధించిన ఆర్డినెన్స్‌కు రాజ్‌భవన్ నుంచి గతేడాది అక్టోబరులో ఆమోదం లభించిందని గుర్తుచేశారు. పున:పరిశీలన కోసం బిల్లును గవర్నర్ తిప్పి పంపడంతో రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో దీనిని పరిశీలించాలని అధికార డీఎంకే నిర్ణయించింది. స్పీకర్ అప్పవు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఆన్‌లైన్ గేమింగ్ ఫెడరేషన్ సభ్యులు గవర్నర్‌ను కలవడాన్ని ప్రస్తావించారు. 'ఈ వ్యవహారంలో గవర్నర్ భిన్న వైఖరులతో ఉన్నట్లు ఉన్నారు. గతంలో ఆర్డినెన్స్‌ను ఆమోదించి... ఇప్పుడు బిల్లును తిప్పిపంపారు. ఈ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. అనేక సంప్రదింపులు, సమాలోచనల తర్వాత రూపొందింది. ఇందుకోసం హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఎస్ చంద్రు నేతృత్వంలోని ప్యానల్ ఏర్పాటైంది. బిల్లును ఆమోదించవద్దని గవర్నర్‌పై ఒత్తిడి ఉందేమో తెలియదుగానీ ఇది రాష్ట్ర పరిధి అంశం కాబట్టి దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవచ్చు' అని అన్నారు. ఇలాంటి ఆటలు ఆడటానికి నైపుణ్యత అక్కరలేదుగానీ ఆటల పేరిట ప్రజలను దోచుకునే నైపుణ్యత మాత్రం ఇక్కడ కనిపిస్తోందని స్పీకర్ వ్యాఖ్యానించారు. ఇదే అంశమై గవర్నర్ తీరును డీఎంకే అధికారిక పత్రిక 'మురసోలి' దుయ్యబట్టింది. ఆన్‌లైన్ ఆటలను స్టార్టప్‌లుగా పరిగణించే కేంద్రప్రభుత్వ వైఖరిని రవి చర్యలలో ప్రతిబింబిస్తున్నట్లు పేర్కొంది. అసెంబ్లీ సార్వభౌమత్వాన్ని పదేపదే అవమానించే గవర్నర్ తీరుకు నిరసనగా ఆందోళనకు సీపీఐ తమిళనాడు శాఖ పిలుపునిచ్చింది.

మద్యం-మనీలాండరింగ్ వ్యవహారాల్లో సిసోడియాకు ఏడు రోజుల ఈడీ కస్టడీ

న్యూదిల్లీ: మద్యం కుంభకోణంతో సంబంధమున్న మనీలాండరింగ్ వ్యవహారంలో దిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు ఈనెల 17వ తేదీ వరకు ఈడీ కస్టడీ విధించారు. ఈ మేరకు కోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. మనీలాండరింగ్ కేసు క్రమంలో కస్టడీలోనే సిసోడియాను ప్రశ్నించేందుకు ప్రత్యేక జడ్జి ఎంకే నాగపాల్ అనుమతిచ్చారు. మద్యం కేసులో సిసోడియాకు బెయిల్‌పై దిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు విచారణ సందర్భంగా ఈడీ తన వాదనలు వినిపించింది. సిసోడియాను 10 రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలని కోరింది. వాదనలు విన్న ధర్మాసనం ఆయనను ఏడు రోజుల ఈడీ కస్టడీకి అప్పగించింది. 'నిపుణుల కమిటీ అభిప్రాయాలను పక్కనబెట్టి.. కొందరికి ప్రయోజనం చేకూర్చేలా నూతన మద్యం విధానాన్ని రూపొందించారు. కొందరు హోల్‌సేల్ డీలర్లకు 12శాతం లాభం ఉండేలా విధానాన్ని తయారుచేశారు. సిసోడియా ఆదేశాలతోనే దీనిపై నిర్ణయం తీసుకున్నట్లు మా వద్ద ఆధారాలున్నాయి. మద్యం విధానంలోని కొన్ని అంశాలను మంత్రుల బృందం సమావేశంలో కనీసం చర్చించలేదు. అయినప్పటికీ విధానాన్ని ఆమోదించి అమల్లోకి తెచ్చారు. అలా వచ్చిన అక్రమ సొమ్మును హవాలా ఛానళ్ల ద్వారా దారి మళ్లించారు. మనీలాండరింగ్‌లో సిసోడియా ఓ భాగమే' అని కోర్టుకు ఈడీ వివరించింది. ఈ దర్యాప్తులో అత్యంత కీలకమైన ఆధారం సిసోడియా ఫోన్ అని, ఆయన దాన్ని ధ్వంసం చేశారని తెలిపింది. సిసోడియా విచారణకు సహకరించలేదని ఆరోపించింది. ఆయనను 10 రోజులు తమ కస్టడీకి అప్పగించాలని కోరింది. ఈడీ కస్టడీ అభ్యర్థనను సిసోడియా తరపు న్యాయవాది వ్యతిరేకించారు. దర్యాప్తు సంస్థలు అరెస్టులు చేయడం తమ హక్కుగా భావిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మద్యం విధానాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ కూడా ఆమోదించారు. ఒక విధానాన్ని అనేక దశల్లో పరిశీలించడం ఓ ఎగ్జిక్యూటివ్ బాధ్యత. మనీలాండరింగ్ కేసులో విధానాల రూపకల్పనపై ఎందుకు ఆరా తీస్తున్నారు? సిసోడియా వద్ద ఒక్క అక్రమ పైసాను కూడా ఈడీ గుర్తించలేదు. కేవలం చెప్పుడు మాటల ఆధారంగానే ఆయనపై కేసు నమోదు చేసింది. మనీలాండరింగ్ ఒక క్రూరమైన చట్టంగా మారుతోంది. కేవలం ఆయనను జైల్లో ఉంచడానికే ఇదంతా చేస్తున్నారు. దర్యాప్తు సంస్థలు అరెస్టులను తమ హక్కుగా భావించడం ఫ్యాషన్ అయిపోయింది. ఇలాంటి అరెస్టులపై కోర్టులు కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం వచ్చింది' అని సిసోడియా తరపు న్యాయవాది వాదించారు. ఉభయపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం సిసోడియాను కస్టడీకి అప్పగించాలన్న ఈడీ అభ్యర్థనకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఏడు రోజులపాటు ఈడీ కస్టడీకి అప్పగించింది. అటు సీబీఐ కేసులో ఆయన బెయిల్ పిటిషన్‌పై విచారణను ఈనెల 21వ తేదీకి వాయిదా వేసింది. సిసోడియా ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు.

మహారాష్ట్ర ఎమ్మెల్యే 'కుక్క మాంసం' వ్యాఖ్యలు

అసోం అసెంబ్లీలో దుమారం

గుహవతి: అసోం ప్రజలకు కుక్క మాంసం తినే అలవాటు ఉందని మహారాష్ట్రకు చెందిన స్వతంత్ర ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు... శుక్రవారం అసోం అసెంబ్లీలో దుమారం రేపాయి. ప్రతిపక్ష శాసనసభ్యులు గవర్నర్ గులాబ్ చంద్ కటారియా ప్రసంగానికి అంతరాయం కలిగించి అనంతరం సభనుంచి వాకౌట్ చేశారు. విపక్ష ఎమ్మెల్యేలు లేచి నిలబడి నినాదాలు చేయడంతో పాటు మహారాష్ట్ర శాసనసభ్యుడిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీంతో గవర్నర్ గులాబ్ చంద్ కటారియా తన ప్రసంగాన్ని 15 నిమిషాలకు కుదించవలసి వచ్చింది. అసోం రాష్ట్ర వాసులు కుక్కల్ని తినేస్తున్నారు కాబట్టి రాష్ట్రంలో వాటి పెరుగుతున్న జనాభాను నియంత్రించడానికి ఇక్కడి వీధికుక్కలను అసోంకు పంపాలని స్వతంత్ర ఎమ్మెల్యే బచ్చు కడు మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపాదించారు. ఈ అంశాన్ని మొదట కాంగ్రెస్ శాసనసభ్యుడు కమలాఖ్య దే పుర్కయస్తా లేవనెత్తారు. ఎమ్మెల్యే కడుపై అసోం ప్రభుత్వం ఏం చర్యలు చేపట్టిం దని ప్రశ్నిం చారు. ప్రధానిపై చేసిన వ్యా ఖ్యలపై తమ పార్టీ నాయకుడు పవన్ ఖేరాను అరెస్టు చేయడానికి రాష్ట్రా నికి చెం దిన పోలీసు బృందం ఇటీవల దిల్లీకి వెళ్లింది కానీ మహారాష్ట్ర ఎమ్మెల్యేపై ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. ఏఐయూడీఎఫ్ ఎమ్మెల్యే రఫీకుల్ ఇస్లాం మాట్లాడుతూ... స్పీకర్ బిస్వజిత్ డైమరీ 'కడు' వ్యా ఖ్యలను ప్రత్యేక హక్కును ఉల్లం ఘించినందుకు సుమోటోగా విచారణకు తీసుకోవాలని, అతడిని అసోం అసెంబ్లీకి పిలిపించి క్షమాపణ చెప్పించాలని కోరారు. స్వతంత్ర శాసనసభ్యుడు అఖిల్ గొగోయ్, సీపీఐ(ఎం) ఎమ్మెల్యే మనోరంజన్ తాలూక్దార్ కూడా అనుచిత వ్యాఖ్యలు చేసిన మహారాష్ట్ర ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష శాసనసభ్యులతో కలిసిపోయారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వెల్‌లోకి వెళ్లి నినదించడంతో స్పీకర్ డైమరీ వారిని తమ స్థానాల్లోకి తిరిగి రావాలని, సరైన మార్గాల ద్వారా విషయాన్ని లేవనెత్తాలని కోరారు. ఈ గందరగోళం మధ్య విపక్ష ఎమ్మెల్యేలంతా సభనుంచి వాకౌట్ చేశారు.కాగా, అసోం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి.

బంగారం స్మగ్లింగ్ కేసులో ఆరోపణలు నిరాధారం

సీపీఎం కేరళ రాష్ట్ర కార్యదర్శి గోవిందన్

ఇడుక్కి (కేరళ) : ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన కుటుంబంపై వచ్చిన ఆరోపణలను ఉపసంహరించుకునే విషయంలో చర్చల కోసం ఒక మధ్యవర్తి తనను సంప్రదించాడంటూ బంగారు స్మగ్లింగ్ కేసులో ప్రధాన నిందితురాలు చేసిన ఆరోపణలను కేరళ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.గోవిందన్ శుక్రవారం తోసిపుచ్చారు. ఫేస్‌బుక్ ప్రత్యక్ష సమావేశంలో గురువారం సాయంత్రం చేసిన తాజా ఆరోపణలపై బంగారు స్మగ్లింగ్ కేసులో ప్రధాన నిందితురాలు స్వప్నా సురేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీఎం కుటుంబానికి వ్యతిరేకంగా సాక్ష్యాలను అందజేసేందుకు తనను సంప్రదించిన మధ్యవర్తిగా స్వప్నా సురేష్ ఆరోపించిన విజేష్ పిళ్లై అనే పేరు తనకు తెలియదని కూడా గోవిందన్ తేల్చి చెప్పారు. తన సొంత జిల్లా అయిన కన్నూర్‌లో 'పిళ్లై' అనే ఇంటిపేరును ఎవరూ ఉపయోగించరని అన్నారు 'స్క్రిప్టు సిద్ధం చేసేటపుడు కథ బాగా కుదిరి ఉండాలి. తొలి నిముషంలోనే ముక్కలయ్యే స్క్రిప్ట్‌ని తయారు చేయడంలో అర్థం ఏమిటి? మేము ఆమెను అన్ని విధాలుగా చట్టపరంగా ఎదుర్కొంటాము. ఈ వ్యక్తులకు ఎవరూ భయపడరు' అని గోవిందన్ ఇక్కడ విలేకరులతో అన్నారు. అలాంటి వ్యక్తుల నుంచి ప్రభుత్వానికి లేదా ముఖ్యమంత్రికి, ఆయన కుటుంబానికి ఎటువంటి సర్టిఫికెట్ అవసరం లేదని తెలిపారు. కన్నూర్‌కు చెందిన విజేష్ పిళ్లై అనే వ్యక్తి తనను సంప్రదించి తనపై గతంలో పెట్టిన అభియోగాలను ఉపసంహరించుకునేందుకు రూ.30 కోట్లు ఇచ్చాడని స్వప్నా సురేష్ ఎఫ్‌బీ లైవ్ ద్వారా ఆరోపణలు చేసిన మరుసటి రోజు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి స్పందించారు. కాగా ఈ తాజా ఆరోపణల నేపథ్యంలో సీపీఎంను ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ విమర్శించాయి.

కేజ్రీవాల్ రాజీనామా చేయాలి

బీజేపీ డిమాండ్

న్యూదిల్లీ: దిల్లీలోని ఆప్ కార్యాలయం వద్ద బీజేపీ నిరసనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ మద్యం విధానాని (ఇప్పుడు రద్దయినది)కి వ్యతిరేకంగా దిల్లీ ఎంపీలు రమేష్ బిధూరి, పర్వేష్ వర్మ సహా పెద్ద సంఖ్యలో బీజేపీ నేతలు, పార్టీ కార్యకర్తలు శుక్రవారం ఇక్కడ నిరసన చేపట్టారు. అనేకమంది బీజేపీ కార్యకర్తలు ఆప్ కార్యాలయం దగ్గర గుమిగూడారు.దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీంతో నగరంలోని మధ్య ప్రాంతంలో పోలీసులు భారీగా మోహరించారు. ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయం ఉన్న దీన్ దయాళ్ ఉపాధ్యాయ మార్గ్‌లో వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. కేజ్రీవాల్ రాజీనామా చేసేంత వరకు నిరసన కొనసాగుతుందని దిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత రాంవీర్ సింగ్ బిధూరి తెలిపారు. తొలుత బీజేపీ కార్యకర్తలు పోలీసులు ఏర్పాటు చేసిన ఒక వరుస బారికేడ్లను తోసుకుని ఆప్ కార్యాలయం వైపు వెళ్లారు. అక్కడ పోలీసులు రెండో వరుస బారికేడ్లను ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. నిరసనలపై నిఘా ఉంచేందుకు డ్రోన్‌లను కూడా మోహరించారు. మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో ఆందోళనకారులందరినీ పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు.

ఆమె నిర్బంధ కూలీనే

గిరిజన బాలిక మృతిపై మహారాష్ట్ర మంత్రి

ముంబై : 2022 సెప్టెంబరులో మరణించిన గిరిజన బాలిక నిర్బంధ కూలీగా పని చేసిందని మహారాష్ట్ర గిరిజనాభివృద్ధి శాఖ మంత్రి విజయ్‌కుమార్ గవిట్ శుక్రవారం శాసన మండలిలో అంగీకరించారు. బాలిక మృతిపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. రాష్ట్రంలో కార్మికులతో నిర్బంధంగా పని చేయించడాన్ని నిషేధించారు. గిరిజన పిల్లల కోసం నిర్వహిస్తున్న 'ఆశ్రమ శాలల'కు సంబంధించిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ, ఆరు నెలల క్రితం నాసిక్ జిల్లాకు చెందిన 10 ఏళ్ల గిరిజన బాలిక మృతిపై కూడా స్పందించారు. బాలికను అహ్మద్‌నగర్ జిల్లాలో పనికి తీసుకువెళ్లారు. కానీ బాలిక తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆమె యజమాని బాలికను తల్లిదండ్రుల ఇంటి వెలుపల పడేశాడు. బాలిక శరీరంపై గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందింది. అంబాదాస్ దన్వే, ఏక్‌నాథ్ ఖడ్సే, శశికాంత్ షిండే సహా ప్రతిపక్ష నాయకులు బాలిక మరణంపై ప్రకటన చేయాలని, ఆమె విక్రయించబడిందో లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి గవిట్ ప్రతిపక్ష సభ్యులను ఎదుర్కోవడానికి ప్రయత్నిస్తూ, 'ఆడపిల్లను అమ్మడం జరగలేదు. కానీ ఆమె ఒక నిర్బంధ కూలీ. ఆ బాలిక అహ్మద్‌నగర్‌లోని పార్నర్ తహసీల్‌లో ఒక కుటుంబంతో కలిసి పని చేస్తోంది' అని తెలిపారు. అయితే గవిట్ ప్రకటన

షిండే నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారినప్పటికీ, ఇది ప్రత్యర్థి ఎమ్మెల్సీలను కూడా ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడానికి ప్రేరేపించింది. జనతాదళ్ సభ్యుడు కపిల్ పాటిల్ మాట్లాడుతూ 'మహారాష్ట్ర అధికారికంగా ఒక చట్టం ద్వారా కార్మికులతో నిర్బంధంగా పని చేయించడాన్ని నిషేధించింది. రాష్ట్రంలో ఇలాంటివి ఎక్కువగా ఉన్నాయని మంత్రి బహిరంగంగా ఒప్పుకోవడం సిగ్గుచేటు. బాలికను నిర్బంధ కూలీగా ఎలా తయారు చేశారో గవిట్ సభకు వివరించాలి' అని నిలదీశారు. కాగా, శాసన మండలిలో చేసిన ప్రకటన ప్రభుత్వ అసమర్థతకు అద్దం పడుతుందని ఖడ్సే అన్నారు. 'కొన్ని సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యాన్ని నేను అర్థం చేసుకోగలను. కానీ పిల్లల అమ్మకం లేదా నిర్బంధంగా కార్మికులతో పని చేయించడం క్షమించరానిది. ఇలాంటి ఘటనలను రాష్ట్రం తేలికగా తీసుకోవద్దు' అని అన్నారు. కాంగ్రెస్-ఎన్‌సీపీ ప్రభుత్వంలో భాగమైనప్పుడు గవిట్ అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. 2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆయన బీజేపీలోకి మారారు.

రాకేశ్ తికైత్‌ను చంపుతామని బెదిరింపు!

ముజఫర్‌నగర్: రైతు నాయకుడు, భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) నాయకుడు రాకేశ్ తికైత్‌ను బాంబులు పేల్చి చంపేస్తామని గుర్తుతెలియని వ్యక్తి బెదిరించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసుకుని విచారణ జరుపుతున్నారు. రద్దు చేసిన మూడు వివాదస్పద వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఆందోళనకు నాయకత్వం వహించిన రైతు నాయకులలో రాకేశ్ తికైత్ ఒకరు. దేశవ్యాప్తంగా రైతు సంఘాలు చేస్తున్న నిరసనల్లో ఆయన పాల్గొంటూనే ఉన్నారు. రైతు నిరసనల నుంచి తప్పుకోకపోతే భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ తికైత్, ఆయన కుటుంబంపై బాంబులతో దాడి చేసి వారిని చంపేస్తామని గుర్తుతెలియని వ్యక్తి బెదిరించాడు. గుర్తుతెలియని వ్యక్తి నుంచి తనకు ఫోన్ కాల్ వచ్చిందని రాకేశ్ తికైత్ సోదరుడు, బీకేయూ అధ్యక్షుడు నరేశ్ తికైత్ కుమారుడు గౌరవ్ తికైత్ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు భౌరా కలాన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో అక్షయ్ శర్మ తెలిపారు. కాల్ చేసిన వ్యక్తిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామనీ, దీనిపై దర్యాప్తు చేస్తున్నామని శర్మ తెలిపారు. గతంలోనూ కొందరు దుండగులు తమకు ఫోన్ కాల్ చేసి చంపేస్తామని బెదిరించారని రాకేశ్ తికైత్ పేర్కొన్నారు. అంతకుముందు కాల్చి చంపుతామని బెదిరించిన వారు ఇప్పుడు బాంబులతో దాడి చేస్తామని బెదిరిస్తున్నారని అన్నారు. బయటకు వెళ్లొద్దనీ, రైతు నిరసనల్లో పాలుపంచుకోవద్దని బెదిరించారని తెలిపారు. రాత్రి 9.10 గంటల సమయంలో గౌరవ్ తికైత్‌కు పదేపదే ఫోన్లు వచ్చాయని, తనను బెదిరించారని, దూషించారని తెలిపారు. ఆ తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండగా, బెదిరింపు సందేశాలు పంపాడని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలలో వైసీపీ అభ్యర్థులను ఓడించండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు:
మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు విజ్ఞతతో ఓటు వేసి వైసీపీని ఓడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపు నిచ్చారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. ఈ అరాచక పాలనకు చరమగీతం పాడాలంటే రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలలో పీడీఎఫ్,- టీడీపీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా జగన్‌మోహన్‌రెడ్డి పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలలో తమ పార్టీ అభ్యర్థులను పోటీ చేయించడమే కాకుండా వారి గెలుపు కోసం దొంగ ఓట్లు నమోదు చేయడం, కోట్ల రూపాయలు ఖర్చు చేయడం దుర్మార్గమన్నారు. ఉపాధ్యాయ సంఘాలు, కార్మికసంఘాలు, పట్టభద్రులు తమ అభ్యర్థులను పోటీలో నిలుపుకొని శాసనమండలికి పంపించుకునే అవకాశం లేకుండా అధికారపార్టీ అభ్యర్థులను నిలుపడం దారుణమన్నారు. పట్టభద్రుల ఓట్ల నమోదులో భారీ ఎత్తున దొంగ ఓట్లు నమోదు చేయించారని విమర్శించారు. దొంగఓట్ల అంశంపై సీపీఐ, సీపీఎం ప్రధాన కార్యదర్శులు డి.రాజా, సీతారాం ఏచూరి, టీడీపీ ఎంపీ రామ్మోహన్‌నాయుడు ఎన్నికల కమిషన్‌ను కలసి ఫిర్యాదు చేస్తారన్నారు. మేధావులు, ఇంజినీర్లు, టీచర్లు, నిరుద్యోగ యువకులకు ఇది మంచి అవకాశం వచ్చిందని వైసీపీని ఓడించి ఈ దుర్మార్గ పాలనకు చరమగీతం పాడాలన్నారు. దొంగ ఓట్లు వేయడానికి వచ్చిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. టీడీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి పీడీఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజుకు రెండవ ప్రాధాన్యత ఓటు వేయాలని, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సోమిశెట్టి, గౌరువెంకటరెడ్డి, బీటీనాయుడు టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తినరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని, పీడీఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి రెండవ ప్రాధాన్యత ఓటును భూమి రెడ్డికి వేయాలని సీపీఐ,ప్రజాసంఘాల నాయకులకు కార్యకర్తలకు రామకృష్ణ పిలుపు నిచ్చారు. టీడీపీ - సీపీఐ కలసి ఈ ఎన్నికలలో అక్రమాలను అడ్డుకొని తమ పార్టీ నేతలను గెలిపించు కోవాలని కోరారు. భవిష్యత్‌లో కూడా రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై కలసి ఉద్యమాలు చేస్తామని తెలిపారు. టీడీపీ కర్నూల, నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, గౌరువెంకటరెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, , ఏఐవైఎఫ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, టీడీపీ బీసీ సంఘం రాష్ట్ర నాయకులు నాగేశ్వరరావుయాదవ్, ప్రభాకర్, నాగేంద్రకుమార్ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

జీఓ నం.1 రద్దు కోసం

20 'చలో అసెంబ్లీ'

పోరాట ఐక్యవేదిక పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్):
జీఓనం.1 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ... ఈనెల 20వ తేదీన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జీఓ నం.1 రద్దు పోరాట ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్లు ముప్పాళ్ల సుబ్బారావు, సుంకర రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ... ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచేలా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన రాజ్యాంగ వ్యతిరేక జీఓ నం.1ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఐక్య వేదిక అనేక ఆందోళనలు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్దుకోలేదన్నారు. రాజ్యాంగ వ్యతిరేక జీఓను రద్దు చేసేవరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించామని, ఈనెల 15 16 తేదీలలో ప్రతి జిల్లాలోనూ జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించి, జీఓనం.1 రద్దు చేయాలని డిమాండ్ చేస్తామన్నారు. 20వ అసెంబ్లీ ముట్టడిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని, ప్రజల వాక్ స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర హక్కుల సంఘాలు న్యాయవాద, దళిత, యువజన, విద్యార్థి, మహిళ, కార్మిక, కర్షక సంఘాల వారు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎమ్.సాయి కుమార్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర కోశాధికారి పి.దుర్గాంబ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు లంక గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రిజుజును బర్తరఫ్ చేయాలి

అతుల్ కుమార్ అంజాన్ డిమాండ్

న్యూఢిల్లీ:
న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజుజును తక్షణమే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్ డిమాండ్ చేశారు. కిరణ్ రిజుజు అజ్ఞానంతో మాట్లాడుతూ న్యాయశాఖ మంత్రి పదవి ప్రతిష్ఠనే దెబ్బతీస్తున్నారని విమర్శించారు. మహారాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెడుతున్న సందర్భంగా ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తమ ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలు చేస్తూ బీఫ్ అమ్మకాలను నిషేధించనున్నట్లు ప్రకటించిన తర్వాత ఆవు రాజవంశం రక్షణ కోసమేనంటూనే మరోవైపు తన కుటుంబసభ్యులతో పాటు తానూ బీఫ్ తింటున్నామంటూ న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజుజు వ్యాఖ్యలు చేయడం విచిత్రంగా వుందన్నారు. మరోవైపు మహారాష్ట్రకు ఆనుకుని ఉన్న గోవా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం బీఫ్ అమ్మకాలు పెంచేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటోందని, కొత్త స్లాటర్ హౌస్‌లను తెరవడం ద్వారా ఇళ్లకు నేరుగా సరఫరా చేసేందుకు కూడా ఏర్పాట్లు చేసున్నదని అంజాన్ అన్నారు. బీజేపీ అనుసరిస్తున్న ఈ ద్వంద్వ విధానాన్ని దేశ ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. మతతత్వ నినాదాలతో ఓట్ల కోసం బీజేపీ అడ్డదారులు తొక్కుతోందని, ఇందుకు న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజుజు వ్యాఖ్యలే నిదర్శనమని అన్నారు. కేబినెట్‌లో కూర్చున్న కొందరు మూర్ఖులు ప్రభుత్వానికి దీపస్తంభాలుగా మారారని, రిజుజును వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని అతుల్ కుమార్ అంజాన్ డిమాండ్ చేశారు.

ఉద్యోగుల ఆందోళనకు సీపీఐ, సీపీఎం మద్దతు

- అనేక చోట్ల ధర్నా: పెద్ద సంఖ్యలో పాల్గొన్న శ్రేణులు
- ఉద్యోగ, ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలని డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ/గుంటూరు/విశాఖ:
ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, బకాయలు, జీతాలు సకాలంలో చెల్లించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, సీపీఎం పిలుపు మేరకు శుక్రవారం రాష్ట్ర వ్యాపితంగా నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాలలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యోగ సంఘాల ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు. విజయవాడలో సీపీఐ, సీపీఎం అధ్వర్యాన ధర్నా చౌక్ వద్ద ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య మాట్లాడుతూ, తాను అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సీపీఎస్‌ను రద్దు చేస్తానని హామి ఇచ్చి మాట తప్పినందుకా! డీఏలు, పీఆర్సీ బకాయిలు చెల్లించనందుకా!, ప్రతినెలా జీతాలు సకాలంలో అందక ఎదురుచూస్తున్నందుకా! ఉద్యోగులు, ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఎందుకు నమ్మాలి? అని సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ సీపీఎస్ రద్దు, ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు ఉద్యమించటానికి సిద్ధం కావటంతో ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి తన అనుచర గణంతో ఉద్యోగులను మాయ చేసేందుకు ప్రయత్నాలు ప్రారం భించారని విమర్శించారు. నాలుగేళ్లు అధికారంలో ఉన్నాం మరొక ఏడాది మాయ మాటలు చెప్పి గడిపేద్దాం అనుకుంటు న్నారని చెప్పారు. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందితే అధికారం సుస్థిరం అవుతుం దనే భ్రమలో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. ఉద్యోగులు ఎవరూ ప్రభుత్వానికి అనుకూలంగా లేరని స్పష్టం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులను తన అనుచర అధికార గణంతో అదుపులో పెట్టుకుందామనే భ్రమలో జగన్ ప్రభుత్వం ఉందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులతో విరోధం పెట్టుకునే ప్రభుత్వాలు మనుగడ సాగించలేవని హితవు పలికారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై రాజకీయ పెత్తనం ఎక్కువైయిందన్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యోగులు ప్రచారంలో పాల్గొంటే చర్యలు తీసుకుం టామని సీఎం హెచ్చరించటాన్ని తప్పుబట్టారు. ప్రభుత్వ ఉద్యోగులను వేధించటం మానుకోవాలని హితవు పలికారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏలు, పీఆర్సీ ఎరియర్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిం చాలన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లు నేరవేర్చ కుంటే వారికి మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ముందుగా సీఐటీయూ నాయకులు కె.దుర్గారావు స్వాగతం పలికారు. ఏఐటీయూసీ విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, సీపీఐ విజయవాడ నగం సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌సీహెచ్. శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు కేవీ భాస్కర రావు, తాడి పైడియ్య, మూలి సాంబశివరావు, పంచదార్ల దుర్గాంబ, డీవీ రమణబాబు, కొట్టు రమణారావు, సంగుల పేరయ్య, తూనం వీరయ్య, కొడాలి ఆనందరావు, సీపీఎం నగర నాయకులు కె.శ్రీదేవి, బోయి సత్తిబాబు, డి.విష్ణువర్ధన్, సీతారామన్, పడాల కనకారావు, ఆర్.మైఖేల్, పగిడికత్తుల రాము, గాదు దుర్గారావు, ఎస్.కె. సుభానీ, బియ్యపు కృష్ణారావు, దాసిన నారాయణరావు, రాచాకుల శ్రీనివాస్, కొండేటి శ్రీనివాసరావు, కె.ఆర్.ఆంజనేయులు, సింగరాజు సాంబశివరావు, డివిజన్ కార్యదర్శులు ఐ.ఆంజనేయులు, రాహేల్‌బాబు, మహిళా నాయకులు తమ్మిన దుర్గ, దుర్గాసి రమణమ్మ, డి.పుష్ప, ఆర్.పిచ్చయ్య, ఏఐవైఎఫ్ నాయకులు లంకా గోవిందరాజులు, లంకే సాయి, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం వేధింపులు ఆపాలని, సంఘాల నాయకులను చర్చలకు ఆహ్వానించి సమస్యలు పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. శుక్రవారం గుంటూరు శంకర్ విలాస్ సెంటర్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో అజయ్ కుమార్, రామారావు మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధకాండ ప్రయోగిస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించలేక పోతోందని, ముఖ హాజరు, యాప్‌ల పేరుతో ఉద్యోగులను భయాందో ళనకు గురి చేస్తూ మానసిక ఒత్తిడికి గురి చేస్తోందని, ఫలితంగా ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు పునరావృతం అవుతున్నాయని చెప్పారు. ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఈ నిరసన కార్యక్రమానికి సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి, సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి, పెన్షనర్‌ల సంఘం నాయకులు గంగాధరరావు, దుర్గారావు, రామారావు, సాంబశివరావు, జి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని, ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో విశాఖలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా సీపీఐ, సీపీఎం కార్యదర్శులు ఎం.పైడిరాజు, ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్దఎత్తున పోరాడుతుంటే ఆ పోరాటాలని అణచివేసే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం హేయమైన చర్యగా పేర్కొన్నారు.

విద్య, వైద్యంపై దృష్టి పెట్టాలి

ప్రభుత్వాలకు వెంకయ్య నాయుడు సూచన

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు:
ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి పెద్ద ఎత్తున ప్రచారం జరగాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమికంగా విద్య, వైద్యంపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. ఉచిత విద్య, ఉచిత వైద్యాన్ని అందించి మౌలిక వసతుల కోసం కేటాయింపులు పెంచడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. నెల్లూరు వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్ట్, మెడికవర్ హాస్పిటల్ సంయుక్త నిర్వహణలో శుక్రవారం ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. స్వర్ణభారత్ ట్రస్టీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం, వైద్య శిబిరానికి భర్తతో పాటు విచ్చేసిన మనుమరాలు సుష్మా కిషన్‌ను అభినందించారు. స్వర్ణభారత్ ట్రస్ట్ బ్రిడ్జి స్కూల్‌కు రూ.50 లక్షల విరాళం, స్వర్ణభారతి విద్యామందిర్‌లోని పిల్లల యూనిఫాం కోసం రూ.10 లక్షల విరాళం అందించిన సుష్మా కిషన్ మామయ్య గోవిందరాజు చొరవను ఆయన అభినందించారు. సేవలో వారసత్వాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు వ్యవసాయం మీద కూడా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు, అందుకు తగిన మౌలిక వసతులు అందించడం ప్రభుత్వాల విధి అని, క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు పటిష్టంగా అమలయ్యేలా జిల్లా స్థాయి అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత జీవనశైలి కారణంగా అసంక్రమిత వ్యాధులు క్రమంగా పెరుగుతున్నాయన్న వెంకయ్యనాయుడు, దీని వల్ల రానున్న రోజుల్లో 40 శాతం మంది క్యాన్సర్ మహమ్మారి బారిన పడే ప్రమాదం ఉందన్న నివేదికల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే గుండె సమస్యలతో యువత మరణాలు పెరుగుతుండటం విచారకరమన్న ఆయన, ఈ నేపథ్యంలో ఆరోగ్యకరమైన జీవనశైలితో పాటు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల మీద కూడా ప్రజలు ప్రత్యేకించి యువత దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఈ ఉచిత ఆరోగ్య వైద్య శిబిరంలో కన్సల్టేషన్ తో పాటు, ఆరోగ్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా రిపోర్టులు, మందులు అందజేశారు.

ఆసీస్ 480 ఆలౌట్

- గ్రీన్ సెంచరీ
- ఆరు వికెట్లు తీసిన అశ్విన్
- టీమిండియా స్కోరు 36/0

అహ్మదాబాద్:
అనుకున్నట్లే జరిగింది... ఆస్ట్రేలియా బ్యాటర్లు అదరగొట్టారు. తొలిరోజు సెంచరీ బాదిన ఉస్మాన్ ఖవాజా ద్విశతకానికి చేరువగా వెళ్లగా, మరో బ్యాటర్ గ్రీన్ కూడా శతకంతో ఆకట్టుకున్నాడు. వెరసి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 480 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ నేపథ్యంలో మూడో రోజు ఆటలో టీమిండియా బ్యాటింగ్ సత్తాకు పరీక్ష ఎదురుకానుంది. ఈ మ్యాచ్‌లో పరిస్థితులు టీమిండియాకు అనుకూలంగా మారా లంటే కనీసం ఒకటిన్నర రోజయినా బ్యాటింగ్ చేయాల్సి ఉం టుంది. రోహిత్ శర్మ, గిల్, పుజారా, కోహ్లి, శ్రేయాస్ అయ్యర్ తమ స్థాయికి తగ్గట్టు రాణిస్తే టీమిండియా మ్యాచ్‌ను శాసించే స్థితికి చేరడం పెద్ద కష్టమేం కాదు. భారత్-ఆస్ట్రేలియా మధ్య ఇక్కడి నరేంద్ర మోదీ స్టేడియంలో జరుగు తున్న నాలుగో టెస్టులో రెండో రోజు శుక్రవారం ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 480 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా రెండో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 36 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ 17, శుభమన్ గిల్ 18 పరుగులతో క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 255/4తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా అదే జోరు కొనసాగిం చింది. ఖవాజా, గ్రీన్ ఇద్దరూ టీమిండియా బౌలర్లను ఏమాత్రం తొట్రుపాటు లేకుండా ఎదుర్కొని పరుగులు పిండుకున్నారు. ఈ క్రమంలో సెంచరీ పూర్తి చేసుకున్న గ్రీన్... అశ్విన్‌కు దొరికిపోయి పెవిలియన్ చేరాడు. ఫలితంగా 208 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. 170 బంతులు ఆడిన గ్రీన్ 18 ఫోర్లతో 114 పరుగులు చేశాడు. ఆ తర్వాత అలెక్స్ కేరీ (0), స్టార్క్ (6) వెంటవెంటనే పెవిలియన్ చేరినప్పటికీ ఖవాజా మాత్రం అదే జోరు కొనసాగించాడు. 150 పరుగులు పూర్తి చేసి డబుల్ సెంచరీ దిశగా దూసుకెళ్తున్నట్టు కనిపించిన ఖవాజాను అక్షర్ పటేల్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. 422 బంతులు ఆడిన ఖవాజా 21 ఫోర్లతో 180 పరుగులు పూర్తి చేసుకున్నాడు. చివర్లో లియాన్ (34), టాడ్ మర్ఫీ (41) కాసేపు భారత బౌలర్లను ఎదురొడ్డారు. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌లో ఒక్క సిక్సర్ కూడా లేకపోవడం గమనార్హం. టీమిండియా స్టార్ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ 6 వికెట్లు తీయగా, షమీ రెండు వికెట్లు పడగొట్టాడు. జడేజా, అక్షర్ చెరో వికెట్ తీశారు.

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో...
బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా అశ్విన్ గుర్తింపు సాధించాడు. ఆసీస్ ప్రధాన స్పిన్నర్ నాథన్ లియాన్‌తో కలిసి అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం అశ్విన్, లియాన్ ఖాతాలో 113 వికెట్లు ఉన్నాయి. మూడు టెస్టుల్లో చెలరేగిన అశ్విన్ నాలుగో టెస్టులోనూ సత్తా చాటాడు. కీలక సమయంలో వికెట్లు తీసి భారత్‌ను పోటీలోకి తెచ్చాడు. ఐదో వికెట్‌కు 208 పరుగులు చేసిన ఉస్మాన్ ఖవాజా, కామెరూన్ గ్రీన్ జోడిని అతను విడదీశాడు. ఒకే ఓవర్‌లో గ్రీన్, అలెక్స్ క్యారీలను ఔట్ చేశాడు. మర్ఫీని ఔట్ చేసి ఐదు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు.



అశ్విన్ రికార్డులు...

బోర్డర్ -గవాస్కర్ ట్రోఫీలో వికెట్ల వేట కొనసాగిస్తున్న భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మరో రికార్డు బ్రేక్ చేశాడు. లెజెండరీ లెగ్ స్పిన్నర్ అనిల్ కుంబ్లే రికార్డు బద్దలు కొట్టాడు. స్వదేశంలో అత్యధికంగా 26సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. కుంబ్లే 122 టెస్టుల్లో ఈ ఫీట్ సాధిస్తే, 92 టెస్టుల్లోనే అశ్విన్ ఆ రికార్డును అందుకోవడం విశేషం.

కొత్త కొత్తగా 'ముంబై ఇండియన్స్' జెర్సీ

ముంబై:
ఐపీఎల్ 16వ సీజన్ మార్చి 31న ప్రారంభం కానుండగా, ఫ్రాంఛైజీలు జట్ల లోగోను విడుదల చేస్తున్నాయి. తాజాగా ఐదు సార్లు ఐపీఎల్ విజేత అయిన ముంబై ఇండియన్స్ తమ కొత్త జెర్సీని విడుదల చేసింది. సంబంధిత ఫొటోలను ట్విట్టర్‌లో పెట్టింది. 'అచ్చంగా ముంబై నగరాన్ని తలపించేలా ఉంది' అని జెర్సీని వర్ణిస్తూ క్యాప్షన్ రాసింది. ముంబై జట్టు కొత్త జెర్సీ చాలా కొత్తగా ఉంది. ముంబై మహానగరంలోని చారిత్రక కట్టడాలు, అక్కడి ప్రజా రవాణా వ్యవస్థలో భాగమైన ట్యాక్సీల బొమ్మలను జెర్సీపై ముద్రించారు. గేట్‌వే ఆఫ్ ఇండియా కట్టడం, అక్కడి రోడ్లపై తిరిగే నలుపు, పసుపు రంగు షేర్ ఆటోలతో పాటు అరేబియన్ సముద్రం, సముద్ర రవాణాను పోలిన బొమ్మలు కొత్త జెర్సీపై ఆకట్టుకుంటున్నాయి. గత సీజన్‌లో దారుణంగా విఫలమైన ముంబై ఈ సారి కప్పు కొట్టాలనే కసితో ఉంది. ఇక గుజరాత్ టైటాన్స్ ఫ్రాంఛైజీ గురువారం టీమ్ కొత్త జెర్సీని విడుదల చేసింది. లోగోపై నక్షత్రం గుర్తు ఉన్న ఈ జట్టు జెర్సీ కొత్తగా ఉంది.

వన్డేలకు షాన్ మార్ష్ వీడ్కోలు

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా వెటరన్ బ్యాటర్ షాన్ మార్ష్ ఫస్ట్ క్లాస్ క్రికెట్, అంతర్జాతీయ వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇకపై అతడు కేవలం టీ20 క్రికెట్లో మాత్రమే కొనసాగనున్నాడు. 39 ఏళ్ల మార్ష్ 2001లో వెస్టర్న్ ఆస్ట్రేలియా తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. 2022లో ప్రతిష్ఠాత్మక షెఫీల్డ్ షీల్డ్ ట్రోఫీని సారథిగా వెస్టర్న్ ఆస్ట్రేలియాకు మార్ష్ అందించాడు. లిస్ట్-ఎ కెరీర్లో 177 మ్యాచ్‌లు ఆడిన మార్ష్... 44.45 సగటుతో 7158 పరుగులు చేశాడు. 26 ఏళ్ల ఫస్ట్‌క్లాస్ కెరీర్లో వెస్టర్న్ ఆస్ట్రేలియా జట్టుకు ఎన్నో అద్భుత విజయాలను షాన్ అందించాడు. మార్ష్ అంతర్జాతీయ కెరీర్ విషయానికి వస్తే... ఆస్ట్రేలియా తరఫున 38 టెస్టులు, 73 వన్డేలు, 15 టీ20ల్లో ప్రాతినిథ్యం వహించాడు. 2019లోనే టెస్టు క్రికెట్‌కు మార్ష్ గుడ్‌బై చెప్పా డు. టెస్టుల్లో అతడు 32.32 సగటుతో 2265 పరుగులు సాధించాడు. అతడి టెస్టు కెరీర్లో 6 సెంచరీలు, 10 అర్ధ శతకాలు ఉన్నాయి. అదే విధంగా వన్డేల్లో 2773 పరుగులు, టీ20ల్లో కేవలం 255 పరుగులు మాత్రమే మార్ష్ చేశాడు. కాగా షాన్ మార్ష్ సోదరుడు మిచెల్ మార్ష్ ప్రస్తుత ఆస్ట్రేలియా జట్టులో కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు.

ఆస్కార్ 'రెడ్ కార్పెట్'పై ఆర్ఆర్ఆర్ చిత్ర బృందం

హైదరాబాద్: సినీ ప్రపంచంలో అత్యున్నత పురస్కారం ఆస్కార్... జీవితంలో ఒక్కసారైనా ఈ పురస్కారాన్ని అందుకోవడం ద్వారా తమతో పాటు తమ దేశానికి పేరు తేవాలని నటీనటులు, దర్శకులు, ఇతర సాంకేతిక నిపుణులు కలలు కంటారనడం అతిశయోక్తి కాదు. కాగా 95వ ఆస్కార్ వేడుకలు మార్చి 12న (భారత కాలమానం ప్రకారం మార్చి 13 ఉదయం) వేడుక అట్టహాసంగా జరగనుంది. అయితే ఈసారి ఆస్కార్ రెడ్‌కార్పెట్‌పై ఆర్ఆర్ఆర్ చిత్ర బృందం సందడి చేయనుంది. రెడ్ కార్పె ట్‌పై నటీనటులు నడుస్తున్నప్పుడు ప్రాంగణం హర్షధ్వానాలతో మార్మో గిపోతుంది. ఫొటో గ్రాఫర్లు సెకన్లలో కొన్ని వందల చిత్రాలు క్లిక్ మనిపిస్తారు. దర్శక ధీరుడు రాజమౌళి దర్శకత్వంలో జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా నిర్మించిన ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటు నాటు పాట ప్రపంచ వ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకుంది. మన దేశంతోపాటు విదే శాల్లోనూ ఈ పాటకు అనేక మంది అభిమా నులు ఉన్నారు. ఎందరో సెలెబ్రిటీలు ఈ పాటకు చిందులేసి వీడియోలు పోస్ట్ చేశారు. ఇటీవలే ఈ పాట ఆస్కార్ నామినేషన్ కూడా దక్కించుకుంది. ఈ పాటకు ఆస్కార్ అవార్డు రావాలని ఎంతోమంది కోరుకుంటున్నారు.

ఎన్నికల ప్రచారకర్తగా రాజమౌళి

హైదరాబాద్: ఎన్నికల ప్రక్రియలో ఓటర్లు పాల్గొనేలా అవగాహన కల్పించేందుకు ప్రభుత్వాలు గట్టి ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పలు రాష్ట్ర ప్రభుత్వాలు సినీ సెలబ్రిటీలను ప్రచార కర్తలుగా నియమించుకుంటున్నాయి. ఇందులో భాగంగా రాబోయే ఎన్నికల కోసం దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి ప్రచార కర్తగా నియమితుల య్యారు. కర్ణాటకలోని రాయచూరు జిల్లాలో ఓటింగ్ శాతం పెంపు కోసం అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రాజమౌళిని జిల్లా ఎన్నికల ప్రచార కర్తగా నియమించినట్లు ఆ జిల్లా పాలనాధికారి చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని నిర్ణయించామని, అందుకు రాజమౌళి సరైన వ్యక్తి అని భావించినట్లు నాయక్ తెలిపారు. రాజమౌళి పేరును రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు సిఫార్సు చేశామని, రాజమౌళి కూడా అందుకు అంగీకరించినట్లు చెప్పారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.